తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.15 కోట్లు



కాలాడివాండ్లపల్లెలో ప్రజల సమస్యలపై అధికారులతో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

- ప్రతి గ్రామానికి తారు రోడ్లు వేయిస్తాం
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 17: మండలంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం 15 కోట్ల రూపాయలు మంజూరు చేశామని, త్వరలో ప్రతి గ్రామానికి తాగునీటితో పాటు తారు రోడ్లు వేయిస్తామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని బి.యర్రగుడి, కోనంపేట, కాలాడివాండ్లపల్లె, అప్పకొండయ్యగారిపల్లె గ్రామాల్లో పర్యటించారు. మంత్రి అయిన తర్వాత మొదటిసారి మండలంలో సమస్యలపై ఆరా తీయడానికి వచ్చిన మంత్రికి అడుగడుగునా మహిళలు పెద్దఎత్తున మంగళ హారతులు పట్టారు. ఈ సందర్భంగా టీడీపీ కార్యకర్త మహబూబ్‌బాషాను ఆయన పరామర్శించారు. అనంతరం గ్రామంలో పర్యటించి మంచినీటి పథకం బోర్లను పరిశీలించి గ్రామంలో సమస్యలపై ఆరా తీశారు. తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు ఆదేశించారు. భూసమస్యలు పెండింగ్ లేకుండా పరిష్కరించాలని తహసీల్దార్ లక్ష్మీప్రసన్నకు తెలిపారు. ప్రతిరోజూ గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలపై ఆరా తీసి వాటిని పరిష్కరించాలని రెవెన్యూ ఇతర అధికారులను ఆదేశించారు. మండలంలో 10 గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని ప్రస్తుతం ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్లు గ్రామస్తులు మంత్రి దృష్టికి తెచ్చారు. వెలిగల్లు ప్రాజెక్టు కుడికాలువ నీరు లక్కిరెడ్డిపల్లెకు వదలాలని రైతులు మంత్రి దృష్టికి తెచ్చారు. ప్రాజెక్టులో నీటిమట్టాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ యనమల మదన్‌మోహన్, ఏపీఐఐసీ మాజీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, దళిత వేదిక జిల్లా అధ్యక్షుడు ఓబులేసు, పీడీఎస్‌యూ నాయకుడు అంకన్న, భాస్కర్‌రెడ్డి, బాబుల్‌రెడ్డి, వెంకటరామరాజు, మాజీ జడ్పీటీసీ రెడ్డెయ్యయాదవ్, వెంకటేశ్వర్లు, నానికుమార్‌రెడ్డి, కొనసాని రాజారెడ్డి, వెంకటరామిరెడ్డి, రామచంద్ర, ఎస్ఐ రవీంద్రబాబు, వీఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.



ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లాలోని చాలా మండలాల్లో జ్వరాలు విజృంభిస్తున్నాయి. అర్బన్ ఏరియాలలో, వార్డుల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. జేబులో డబ్బు ఉన్న వాళ్లు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి వేలాది రూపాయలు ఖర్చు చేసి చికిత్సలు పొందుతుండగా స్థోమత లేని వారు విధి లేక ప్రభుత్వ ఆసుపత్రులకు వెళుతూ అనేక ఇబ్బందులు పడుతున్నారు. చాలా వరకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు సమయపాలన పాటించడం లేదు. ప్రజలు వైద్యం కోసం వచ్చినపుడు అందుబాటులో ఉండడం కంటే వైద్యులు ఉన్నప్పుడే వైద్యం దిక్కు అనే రీతిలో ఉంది. జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య సేవలపై మంగళవారం ఆంధ్రజ్యోతి బృందం పరిశీలన చేసింది. ఈ సందర్భంగా ఆసుపత్రుల్లో ఉన్న పరిస్థితులను ఒకసారి గమనిస్తే..

రాజంపేట ఏరియా ఆసుపత్రిలో రక్తపరీక్షల కోసం వేచి ఉన్న రోగులు

వైద్యం అందడం లేదు..

- జ్వరాలతో విలవిల్లాడుతున్న రోగులు
- సమయపాలన పాటించని వైద్యులు..
- జిల్లా ఆసుపత్రులు.. కమ్యూనిటీ ఆసుపత్రుల్లోనూ ఇంతే..
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో.. ఇక సరేసరి

ఆంధ్రజ్యోతి విజిట్

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): రాయచోటి ప్రభుత్వాసుపత్రిలో ఉదయం 9 గంటలకు రావాల్సిన వైద్యులు.. 10.45కు కూడా రాలేదు. దీంతో రోగులు గంటల తరబడి వైద్యుల కోసం ఎదురు చూడాల్సి వచ్చింది. మంగళవారం ఓ మహిళ డాక్టర్ల కోసం ఎదురు చూసి గంటల తరబడి నిలబడే ఓపిక లేక.. పక్కనే ఉన్న బెడ్డు మీద పడుకుంది. ఆమెకు ఇప్పటికే బైపాస్ సర్జరీ చేశారని ఆమె బంధువులు తెలిపారు. స్కానింగ్ సెంటర్లో సుమారు 20 మంది గర్భిణీలు దాదాపు గంటన్నరసేపు క్యూలో ఉండి అవస్థలు పడ్డారు. ఇక్కడ ఆధునిక పరికరాలు ఇచ్చారే కానీ.. వాటిని ఉపయోగించే సిబ్బంది తక్కువగా ఉన్నారు. దీంతో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందడం లేదు. ఫార్మసీ విభాగంలోనూ సిబ్బంది తక్కువ ఉన్నట్లు ఆసుపత్రి సూపరిండెంట్ డేవిడ్ సుకుమార్ తెలిపారు. లక్కిరెడ్డిపల్లె కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో 8 మంది వైద్యులు ఉండగా ఉదయం వచ్చి మధ్యాహ్నం 12 గంటలకే ఏడుగురు వెళ్లిపోయారు. ఒకరు మాత్రమే సాయంత్రం 4 గంటల వరకు ఉన్నారు. చిన్నమండెం మండల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యులు రాకపోవడంతో రోగులు గంటల తరబడి వేచి చూశారు. గాలివీడు మండలంలో రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోనూ వైద్యులు రాలేదు.


- రాజంపేట ఏరియా ఆసుపత్రికి ఎక్కువగా మలేరియా, టైఫాయిడ్, విషజ్వరాల బారిన పడిన రోగులు వస్తున్నారు. వీరికి సరైన వైద్యం అందడం లేదు. ప్రధానంగా సూపరిండెంట్ సక్రమంగా విధులకు హాజరు కావడం లేదు. డాక్టర్లు సమయపాలన పాటించడం లేదు. దీంతో ఇక్కడ ఎక్కువగా రోగులు ప్రైవేటు ఆసుపత్రులకు వెళుతున్నారు. రాజంపేట నియోజకవర్గంలోని నందలూరు, ఒంటిమిట్ట, సిద్దవటం, వీరబల్లి, సుండుపల్లె మండలాల్లో విషజ్వరాలు ఎక్కువగా ఉన్నాయి. సుండుపల్లె ఆసుపత్రి చాలా దారుణంగా ఉంది. ఇక్కడ ఆసుపత్రి గదిలో మూడు బెడ్లు ఉన్నాయి. ఎప్పుడూ తాళం వేసి ఉంటారు. మండలంలో మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సక్రమంగా పని చేయడం లేదని రోగులు వాపోతున్నారు. సిద్దవటంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు జ్వరపీడితులతో కిటకిటలాడుతున్నాయి. ఒంటిమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో జ్వరాలు ఎక్కువగా ఉన్నాయి.
- రైల్వేకోడూరు నియోజకవర్గ కేంద్రం కోడూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ప్రధానంగా డ్రైనేజీ సమస్య ఉంది. ఆసుపత్రిలో డ్రైనేజి సమస్య ఉండడంతో ఆసుపత్రి ఆవరణం దుర్గంధంగా ఉంది. ఇక్కడ సిబ్బంది కొరత ఉంది. ఇక్కడ జ్వరపీడితులు ఎక్కువగా ఉన్నారు. చిట్వేలిలో నూతనంగా ఆసుపత్రి భవనం మూడు నెలల కిందట నిర్మాణం పూర్తి అయింది. అయితే ఇప్పటికీ ప్రారంభించలేదు. దీంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. వర్షం వస్తే పాత ఆసుపత్రి భవనం ఉరుస్తోంది. పెనగలూరు, ఓబులవారిపల్లె మండలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో రోగులకు సరైన వైద్యం అందలేదని రోగులు వాపోతున్నారు.
- మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాలలో పలువురు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోని వైద్యాధికారులు సమ్మెలో ఉన్నారు. దీంతో సీరియస్ కేసులన్నీ మదనపల్లెకు రెఫర్ అవుతున్నాయి. నిమ్మనపల్లె పీహెచ్‌సీలో వైద్యాధికారి రమేష్‌బాబు డిప్యూటీ డీఎంహెచ్‌వోగా బాధ్యతలు నిర్వహిస్తుండగా. మరో వైద్యాధికారి ప్రత్యూష్ విజయవాడలో సమ్మెలో పాల్గొనేందుకు వెళ్లినట్లు సమాచారం. మదనపల్లె మండలంలోని సీటీఎం పీహెచ్‌సీ ఆవరణం ముళ్లపొదలు, పిచ్చిమొక్కలతో పాములకు ఆవాసంగా మారింది. మదనపల్లె పట్టణంలోని సర్వజన బోధనాసుపత్రిలో 19 విభాగాల్లో ఓపీ సక్రమంగానే జరిగింది. సుమారు 670 మంది ఓపీలో చికిత్స చేయించుకున్నారు. ఇక్కడ చిన్న చిన్న కేసులను కూడా తిరుపతికి రెఫర్ చేస్తుండడంపై రోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిపుణులైన వైద్యులు ఉన్నప్పటికీ చికిత్సలు చేయకుండా రెఫర్ చేస్తున్నారు. పెద్దమండ్యం ప్రభుత్వాస్పత్రిలో ఇద్దరు వైద్యులు ఉన్నారు. మంగళవారం ఇద్దరూ విధులకు హాజరు కాలేదు. ఇక్కడ పనిచేస్తున్న సూపర్‌వైజర్లలో ఇద్దరు ఏడాది కిందట బదిలీ అయ్యారు. అప్పటి నుంచి మరెవరినీ భర్తీ చేయలేదు.. రూ.25 లక్షలతో నూతనంగా నిర్మించిన ల్యాబ్ టెక్నీషియన్ భవనం ప్రారంభానికి నోచుకోలేదు.
- బి.కొత్తకోట 30 పడకల ఆస్పత్రిని వైద్యుల కొరత పట్టి పీడిస్తోంది. ఇక్కడ ఏడుగురు వైద్యులు ఉండాల్సి ఉండగా నలుగురు మాత్రమే ఉన్నారు. దీంతో ప్రతిరోజూ వందల సంఖ్యలో వచ్చే రోగులకు వైద్య సేవలు సకాలంలో అందడం లేదు. ప్రతిరోజూ 300 నుంచి 400 వరకు రోగులు వస్తున్నారు. 50 మంది వరకు జ్వరపీడితులు చికిత్స కోసం వస్తున్నారు. తంబళ్లపల్లె 30 పడకల ఆస్పత్రిలో ఏడుగురు ఉండాల్సి ఉండగా ఇద్దరు డిప్యూటేషన్‌పై విధుల్లో ఉన్నారు. వీరిలో ఒకరు సెలవులో వెళ్లారు. మిగిలిన ఇద్దరు వైద్యులు విధులకు హాజరయ్యారు. మిగిలిన ఇద్దరు నైట్‌షిఫ్టుకు వస్తారని సిబ్బంది తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొత్తగా అదనపు గదులు నిర్మించి మౌలిక వసతులు కల్పించకుండా ప్రారంభించారు.
- పీలేరు మండలం రేగళ్లలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్ని వసతులు ఉన్నప్పటికీ వైద్యులు లేకపోవడంతో రోగులకు తిప్పలు తప్పలేదు. తమ డిమాండ్ల సాధన కోసం వైద్యులు సమ్మెలో ఉండడంతో కొన్ని రోజులుగా రేగళ్ల పీహెచ్‌సీ పరిధిలోని ప్రజలు సరైన వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారు. గుర్రంకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 24 గంటల ఆసుపత్రి. ఇక్కడ పనిచేసే ఇద్దరు డాక్టర్లు సకాలంలో రాకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రిలో స్టాఫ్‌నర్సుల కొరత ఉండడంతో సచివాలయాల్లో పనిచేసే ఎంఎల్‌హెచ్‌పీలతో ఓపీ సేవలను చేయిస్తున్నారు. 24 గంటల ఆసుపత్రి కావడంతో రాత్రిపూట డాక్టర్ ఉండేలా చూడాలని మహిళా రోగులు కోరుతున్నారు. వాల్మీకిపురం ప్రభుత్వ వైద్యశాలలో 11 మంది డాక్టర్లకు గాను 9 మంది డాక్టర్లు అందుబాటులో ఉన్నారు. చిన్నపిల్లల వైద్యులు, జనరల్ ఫిజీషియన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. చిన్నపిల్లల వైద్యులు అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు స్థానికులు వాపోతున్నారు. పాత భవనాలలో ఉన్న ఐసోలేషన్ వార్డులో గోడలు దెబ్బతిన్నాయి. కలికిరి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మొత్తం 10 మంది వైద్యులు పనిచేస్తుండగా అందులో ఒకరు మెటర్నిటీ సెలవులో ఉన్నారు. మరో ఇద్దరు వేర్వేరు డ్యూటీలతో ఓడీలో ఉన్నారు. మంగళవారం ఏడుగురు వైద్యులు డ్యూటీలో ఉన్నారు.



రాయచోటిలో స్కానింగ్ కేంద్రం వద్ద డాక్టర్ కోసం ఎదురు చూస్తున్న గర్భిణులు



గుర్రంకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం కోసం నిరీక్షిస్తున్న రోగులు



పీలేరులోని రేగళ్లు పీహెచ్‌సీలో ఖాళీగా ఉన్న రిసెప్షన్ విభాగం, ఎదురుచూస్తున్న రోగులు

పక్కాగా ఫ్రీహోల్డ్ రీవెరిఫికేషన్

- ప్రభుత్వ నిబంధనలు పాటించాలి
- వారంలో పరిశీలన పూర్తి చేయాలి
- జేసీ ఆదర్శ్ రాజేంద్రన్



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి(కలెక్టరేట్), సెప్టెంబరు 17: ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్ల రీవెరిఫికేషన్ ప్రక్రియ పక్కాగా ప్రభుత్వ నిబంధనల మేరకు చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ వీసీ హాలులో సబ్‌కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఫ్రీహోల్డ్ భూముల వెరిఫికేషన్‌కు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయిలో వాటిని పటిష్టంగా అమలు చేయాలన్నారు. భూముల కేటగిరీలో అవి చుక్కల భూములా, ఈనాం భూములా, ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్ తర్వాత భూముల విస్తీర్ణం ఎంత, కాకముందు ఎంత, కొనుగోలు చేశారా లేక గిఫ్ట్ ఇచ్చారా, థర్డు పార్టీ తీసుకున్నారా, తదితర విషయాలపై పూర్తిగా విచారించాలని తెలిపారు. ఇందులో అసైన్‌మెంట్ భూములను కూడా పరిశీలించి త్వరగా నివేదిక ఇవ్వాలన్నారు. సమావేశంలో సబ్ కలెక్టర్ నిదియాదేవి, ఆర్డీవో రంగస్వామి, తహసీల్దార్లు, సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుకపై తహసీల్దార్లు పర్యవేక్షణ చేయాలి

జిల్లాలో ఉచిత ఇసుక బల్క్ ఆర్డర్లను తహసీల్దార్లు స్వయంగా పర్యవేక్షించాలని, దీనిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జాయింట్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఉత్తర్వులు పటిష్టంగా అమలు పరచాలని తెలిపారు. ఇసుక ధర ఒక్కో రీచ్ పరిధిలో స్టాక్ పాయింట్‌కు ఒక్కొక్క ధర నిర్ణయించిందని ధరపై రవాణా చార్జీలు అదనంగా చెల్లించాల్సి వుంటుందన్నారు. ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సి అవసరం ఉందన్నారు. జిల్లాలో నదులు, కెనాల్, బ్యారేజ్‌లు, వాగులు, డ్యాంలలో అందుబాటులో ఉన్న వాటి ద్వారా ఇసుక అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఎక్కడెక్కడ ఇసుక అక్రమంగా నిల్వలు ఉన్నాయో తెలుసుకుని గనుల శాఖ ద్వారా నోటీసులు ఇచ్చి వాటిని స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు జిల్లా స్థాయిలో కంట్రోల్‌రూం, టోల్‌ఫ్రీ నెంబర్లు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

నులిపురుగులను నివారిద్దాం : డీఎంహెచ్‌వో



గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌వో కొండయ్య

రాయచోటిటౌన్, సెప్టెంబరు 17: శుభ్రత పాటించి నులిపురుగులను నివారిద్దామని డీఎంహెచ్‌వో కొండయ్య పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన రాయచోటి పట్టణంలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజనం అనంతరం విద్యార్థినులకు నులిపురుగుల నిర్మూలన మాత్రలైన అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

అంతకుముందు ఆర్‌బీఎస్‌కే (రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం) జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ శివప్రతాప్ నాయక్ విద్యార్థులకు నులిపురుగుల నిర్మూలన ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. జిల్లా వ్యాప్తంగా మంగళవారం మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి చేశామని తెలిపారు. పాఠశాలలకు గైర్హాజరైన విద్యార్థులకు కూడా మాత్రలు పంపిణీ చేస్తామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రోగ్రాం అధికారులు, వైద్యులు, పర్యవేక్షకులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షణ చేశారు. కార్యక్రమంలో డేటా ఆపరేటర్ నరసింహులు, ప్రిన్సిపాల్ లత, ఉపాధ్యాయులు, బాలికలు పాల్గొన్నారు.

స్వచ్ఛ రాయచోటి సాధనకు కృషి చేయాలి

- డీపీవో, రాయచోటి మున్సిపల్ కమిషనర్

రాయచోటిటౌన్, సెప్టెంబరు 17: స్వచ్ఛ రాయచోటి సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి, జడ్పీ డిప్యూటీ సీఈవో జీవీ రమణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ వాసుబాబు తెలిపారు. మంగళవారం వారు స్వచ్ఛతాహి సేవ అవగాహన ర్యాలీని మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్యాలయం నుంచి బస్టాండు గుండా నేతాజీ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి విద్యార్థులతో మానవహారం చేశారు. బంగ్లా సర్కిల్‌లో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు రోడ్లను శుభ్రపరిచి స్వచ్ఛ సంకల్పం తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మా గాంధీ కలలుకన్న భారతదేశం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛభారత్, స్వచ్ఛ రాయచోటి కోసం పాటుపడతామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కుప్పం నియోజకవర్గ పరిశీలకులు గాజుల ఖాదర్‌బాషా, మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, కౌన్సిలర్ మదన్‌మోహన్‌రెడ్డి, డీఈవో శివప్రకాశ్‌రెడ్డి, జిల్లా పశుసంవర్థకశాఖ అధికారి గుణశేఖర్‌పిళ్లై, డీడీ మాలకొండయ్య, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, నోబెల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర బాధ్యులు కొండూరు శ్రీనివాసరాజు, మున్సిపల్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, విద్యార్థులు పాల్గొన్నారు. కాగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా అర్బన్ సీఐ చంద్రశేఖర్ బందోబస్తు నిర్వహించారు.



రాయచోటిలో స్వచ్ఛతా హి సేవలో చీపురు పట్టి రోడ్లు ఊడుస్తున్న అధికారులు

నియోజకవర్గ ఇన్‌చార్జిలతో లోకేశ్ భేటీ

- హాజరైన సుగవాసి



నారా లోకేశ్‌తో భేటీ అయిన బాలసుబ్రమణ్యం

రాజంపేట, సెప్టెంబరు 17: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఓడిపోయిన అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన టీడీపీ ఇన్‌చార్జిలతో మంగళవారం అమరావతిలో నారా లోకేశ్ భేటీ అయ్యారు. టీడీపీ ప్రధాన నాయకులు సార్వత్రిక ఎన్నికల్లో ఎలా పనిచేశారు, కనీసం వారి గ్రామాల్లో పార్టీ విజయానికి కృషి చేశారా లేదా? అక్కడ వైసీపీకి, టీడీపీకి వచ్చిన ఓటింగ్ శాతం గురించి ఆయన ఆరా తీశారని తెలిసింది. ఈ భేటీకి రాజంపేట తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన సుగవాసి బాలసుబ్రమణ్యం హాజరయ్యారు. రాజంపేటలో టీడీపీ ఓటమికి సంబంధించి ఆయన నారా లోకేశ్‌కు వివరించారు. ఓటమి చెందిన చోట టీడీపీ నేతల పనితీరుపై త్వరలో చర్యలు తీసుకుంటామని నారా లోకేశ్ ఇన్‌చార్జిలకు హామీ ఇచ్చారని సమాచారం. అనంతరం మంగళవారం రాత్రి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో సుగవాసి భేటీ అయ్యారు. రాజంపేట నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై చర్చించారు.

రాచరికం విధానానికి స్వస్తి

- జిల్లాలో ఫ్రెండ్లీ రిజిస్ట్రేషన్లు
- మదనపల్లెలో బేఖాతర్

మదనపల్లె టౌన్/కలికిరి, సెప్టెంబరు 17: ప్రైవేటు ఆస్తులు విక్రయించేవారు, కొనుగోలు చేసే వారు ప్రభుత్వానికి నిర్దిష్ట చలానాలు కట్టి సొమ్ము చెల్లిస్తారు. అటువంటి ఆదాయం ఇచ్చే వారు కోర్టులో నిలబడిన వారి మాదిరిగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఎరుపు వస్త్రం కప్పిన పోడియం వద్ద నిలబడి, సబ్ రిజిస్ట్రార్ అడిగే ప్రశ్నలకు అవునంటూ సమాధానాలు చెప్పడం చూస్తూనే ఉన్నాము. ఇలాంటి బ్రిటీష్ రాజరికం విధానానికి స్వస్తి చెప్పడానికి రాష్ట్ర ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పోడియంలు, వాటికి చుట్టిన ఎరుపు వస్త్రాలు తొలగించడంతో పాటు ఎత్తయిన వేదికలను తీసేసి ప్రజలతో పాటు సమానంగా కూర్చొని విధులు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్‌పీ సిసోడియా ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

మూడు రోజులుగా కార్యాలయాల్లో మరమ్మతులు

జిల్లాలోని 12 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రభుత్వ ఉత్తర్వులను అమలు చేసేందుకు అధికారులు రంగంలోకి దిగారు. రెండవ శనివారం, ఆదివారం, సోమవారం(మిలాద్ ఉన్ నబి) వరుస సెలవు రోజులు రావడంతో అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఎత్తయిన వేదికల మీద ఉన్న పోడియంలను, ఎరుపు వస్త్రాలను తొలగించారు. అంతేకాకుండా వేదికలను కూల్చివేసి కార్యాలయంలో క్లర్కులు కూర్చునే హాలుకు సమానంగా సబ్ రిజిస్ట్రార్ టేబుళ్లు, కుర్చీలే వేశారు. రిజిస్ట్రేషన్‌కు వచ్చే ప్రజలను మర్యాదగా పలకరించడంతో పాటు వారికి తాగునీరు, టీ, కాఫీ అందించే ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో రాయచోటి, లక్కిరెడ్డిపల్లె, గాలివీడు, రాజంపేట, పుల్లంపేట, సుండుపల్లె, చిన్నమండ్యం, పీలేరు, కలికిరి, వాల్మీకిపురం, బి.కొత్తకోట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ మునికృష్ణయ్య ఆదేశాలతో పోడియంలను తొలగించే పనులు ప్రారంభించారు. కొన్నింటిలో పోడియం తొలగించడంతో పాటు మంగళవారానికే ప్రజల రిజిస్ట్రేషన్లకు ఆటంకం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం నుంచి ఫ్రెండ్లీ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభించారు.



మదనపల్లె సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తొలగించని పోడియం



కలికిరిలో మారిన సబ్ రిజిస్ట్రారు కొత్త సీటు

మదనపల్లెలో తొలగించని పోడియం

జిల్లాలోనే అత్యధికంగా ప్రభుత్వానికి ఆదాయం తెచ్చి పెట్టే మదనపల్లె సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉన్నతాధికారుల ఆదేశాలను పట్టించుకోలేదు. మంగళవారం మధ్యాహ్నం వరకు మదనపల్లె సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ కూర్చునే పోడియంను అలాగే ఉంచేశారు. కనీసం అక్కడ వున్న బీరువాలు, అల్మారాలను కూడా పక్కకు కూడా జరపలేదు. దీంతో రిజిస్ట్రేషన్‌కు వచ్చిన ప్రజలు ఔరా అని ముక్కున వేలేసుకున్నారు. ఈ విషయమై ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ రాజు మాట్లాడుతూ మూడు రోజులు సెలవు దినాలైనా పోడియం తొలగించేందుకు కూలీలు దొరకలేదన్నారు. త్వరలో పోడియంను తీసేస్తామని తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో రైతు మృతి



సోమిరెడ్డి మృతదేహం, సోమిరెడ్డి (ఫైల్)

పులివెందుల టౌన్, సెప్టెంబరు 17: పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని ఉలిమెల్ల గ్రామానికి చెందిన రైతు సోమిరెడ్డి (58) విద్యుత్‌షాక్‌తో మంగళవారం మృతి చెందాడు. వివరాల మేరకు.. రైతు సోమిరెడ్డి గ్రామంలోని తన తోట వద్దకు రోజు మాదిరిగానే మంగళవారం వెళ్లాడు. విద్యుత్ స్టార్టర్ ఆన్‌చేయగా.. ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి చనిపోయాడన్నారు.ఇంటి పెద్దను కోల్పోవడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతుడు సోమిరెడ్డికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు సంఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఉరి వేసుకుని వ్యక్తి మృతి



పులివెందుల టౌన్, సెప్టెంబరు 17 : పులివెందుల పట్టణంలోని జెండామానువీధికి చెందిన సయ్యద్ ఖాసింపీరా కుమారుడు సయ్యద్ ఖాదర్‌బాషా (43) మంగళవారం ఉరి వేసుకుని మృతి చెందాడు. వివరాల మేరకు.. ఖాదర్‌బాషా గత కొంత కాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతూ ఇంటిలోనే ఉండేవాడు. ఆరోగ్యం కుదుటపడక పోవడంతో మనస్థాపం చెంది ఇంటిలో ఎవరు లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని మృతి చెందినట్లు తెలిపారు. ఆయనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు సంఘటనాస్థలానికి వెళ్లి ఖాదర్‌బాషా మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు.

బావిలో పడి వృద్ధురాలు మృతి

ముద్దనూరు సెప్టెంబరు 17: మండల పరిధి ఓబులాపురం గ్రామ సమీపంలోని బావిలో ప్రమాదవశాత్తు చెనన్నమ్మ(65)అనే వృద్ధురాలు పడి మృతి చెందారు. స్థానికుల వివరాల మేరకు.... మూడు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లిన చెనమ్మ చూపు సరిగా కన్పించక పోవడంతో బావిలో పడటంతో మృతి చెందింది. మంగళవారం మృతదేహం బావిలోని నీటిలో తేలి, దుర్వాస రావడంతో ప్రజలు చెన్నమ్మగా గుర్తించారు.

లారీ, ఆర్టీసీ బస్సు ఢీ.. పలువురికి గాయాలు

రామాపురం, సెప్టెంబరు 17: మండలంలోని కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ కొత్తరోడ్డు నారాయణపురం పోలీస్ చెక్‌పోస్టు వద్ద సోమవారం అర్ధరాత్రి లారీ, ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. వేలూరు నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న ఏపీఎస్‌ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సును కడప నుంచి రాయచోటి వైపు వస్తున్న సిమెంటు లారీ ఢీకొనడంతో బస్సులో ప్రయాణిస్తున్న పలువురుకి స్వల్ప గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి ఎస్ఐ వెంకటసుధాకర్ రెడ్డి సిబ్బందితో చేరుకొని గాయపడిన వారిని కడప, రాయచోటి ఆసుపత్రులకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తిపై దాడి కేసులో ఐదేళ్ల జైలు

సికెదిన్నె, సెప్టెంబరు 17: వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన కేసులో సయ్యద్ దస్తగిరి అనే వ్యక్తికి ఐదు సంవత్సరాలు జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ప్రవీణ్‌కుమార్ శిక్ష విధించినట్లు సికెదిన్నె సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు. సీఐ వివరాల మేరకు.. చింతకొమ్మదిన్నె మండలం బలిజపల్లికి చెందిన పగడాల నాగయ్యకు నాయనవారిపల్లెకు చెందిన సయ్య ద్ దస్తగిరి మధ్య భూ తగాదా ఉండేది. ఈ నేపథ్యంలో నాగయ్య తన పొలంలో వ్యవసాయ పనులు చేసుకుంటుండగా దస్తగిరి తల్వార్‌తో దాడి చేసి గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు 3.5.2016న పోలీ సులు కేసు నమోదు చేశారు. దీనిపై విచారణ జరిపి.. మంగళవారం కోర్టు శిక్షను విధించినట్లు సీఐ తెలిపారు.

నేటి నుంచి లా పరీక్షలు

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 17: వైవీయూలో ఈ నెల 18 నుంచి 3, 5 సంవత్సరాల ఎల్ఎల్‌బీ సెమిస్టరు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసరు ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సుకు సంబంధించి 2, 4, 6 సెమిస్టర్లు, ఐదేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సుకు 2, 4, 8, 10 సెమిస్టర్లు చదివే విద్యార్థులు నిర్ణీత తేదీల్లో సూచించిన సమాయానికి పరీక్షలకు హాజరు కావాలన్నారు. పరీక్షలు అక్టోబరు 10వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. విద్యార్థులు నిబంధనలు పాటించాలని సూచించారు. చదువుతున్న కళాశాలల నుంచి హాల్‌టికెట్లు గుర్తింపు కార్డులతో పరీక్షలకు హాజరు కావాలన్నారు. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని తెలిపారు.

ఇష్టానుసారం బార్లు తెరిస్తే చర్యలు తప్పవు : సీఐ

కడప క్రైం, సెప్టెంబరు 17: నిబంధలనలకు విరుద్ధంగా బార్లు తెరిస్తే చర్యలు తప్పవని వన్‌టౌన్ సీఐ రంగాస్వామి హెచ్చరించారు. వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో మంగళవారం బార్ల యాజమాన్యంతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కొందరు తెల్లవారుజామున 5గంటలనుంచి బార్లు తెరచి వ్యాపారాలు చేస్తున్నారని.. ఉదయం 10 గంటలపైనే తెరుచుకోవాలన్నారు. బార్లపై పోలీసు నిఘా ఉంటుందని.. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్ఐ అమర్‌నాథ్‌రెడ్డి, బార్ల యాజమన్యం పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

నందలూరు, సెప్టెంబరు 17 : మండలంలోని పాటూరు గ్రామ పంచాయతీ బీసీ కాలనీలో మంగళవారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఓ ఇల్లు దగ్ధమైంది. ఈప్రమాదంలో ఇంటిలోని బైక, టీవీ, కూలర్, ఫ్యాన్లు తదితర వస్తువులు పూర్తిగా కాలిపోయాయని బాధితుడు శివకుమార్ వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

పేదల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం



లబ్ధిదారులకు మెగా తాళం చెవిని అందజేస్తున్న కలెక్టర్ శివశంకర్

కడప(కలెక్టరేట్), సెప్టెంబరు 17: పేదల సొంతింటి కలను నెరవేర్చడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని కలెక్టర్ లోతేటి శివశంకర్ పేర్కొన్నారు. మంగళవారం భువనేశ్వర్ నుంచి పీఎంఏవై గ్రామీణ్, అర్బన్‌కు సంబంధించి ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 విధి విధానాలను భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. కార్యక్రమానికి కలెక్టరేట్ ఎన్ఐసీ హాలు నుంచి కలెక్టర్ శివశంకర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా దేశంలోని గ్రామీణ, మున్సిపల్, అర్బన్ డెవలప్మెంట్ ప్రాంతాలలో 2023-24కు సంబంధించి నిర్మాణాలు పూర్తి చేసుకున్న కోటి యాభై లక్షల ఇళ్లతో పాటు, ఆవాస్‌ప్లస్ 2024 యాప్‌ను ప్రధానమంత్రి వర్చువల్‌గా ప్రారంభించారు. ప్రధాని ప్రసంగం ముగిసిన తరువాత కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి విడుదల చేసిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 విధి విధానాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండలన్నారు ఇల్లు లేని ప్రతి నిరుపేదకు ఒక ఆవాసం ఏర్పాటు చేయడం ప్రభుత్వాల ప్రధాన ఉద్దేశ్యమన్నారు. జిల్లాలో ఇప్పటికే గృహాలు మంజూరైన వారందరూ త్వరగా ఇళ్లను పూర్తి చేసుకోవాలన్నారు. గృహనిర్మాణ శాఖ చిత్తశుద్ధితతో కృషి చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్న కాలనీలలో మౌలికసదుపాయాలన్నింటిని కల్పించాలన్నారు. తుది దశలో ఉన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అనంతరం గృహ లబ్ధిదారులకు మెగా తాళం చెవిని కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ నందన్, హౌసింగ్ పీడీ కృష్ణయ్య, డీఆర్డీఏపీడీ ఆనంద్ నాయక్, మెప్మా పీడీ సురేష్ నాయక్, డ్వామా పీడీ జోయల్ విజయ్ కుమార్, గృహ నిర్మాణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి : ఎస్పీ



ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

కడప (క్రైం), సెప్టెంబరు 17: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వ చ్చే ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి ఎస్పీ నేరుగా ఫిర్యాదులను స్వీకరించి.. వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులను సంబంధిత పోలీసు అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యతనిస్తూ.. సమగ్ర విచారణ జరిపి సమస్యలను పరిష్కరిస్తామని ఎస్పీ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయానికి రాలేనటువంటి ప్రజలు జిల్లాలోని పోలీసుస్టేషన్లలో, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. సదరు ఫిర్యాదులను, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదులుగానే పరిగణించి సత్వర న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ రమాకాంత్ పాల్గొన్నారు.

ఎంపీ అవినాశ్‌రెడ్డికి సమస్యల వెల్లువ



జమ్మలమడుగు ప్రజాదర్బార్‌లో ఎంపీ అవినాశ్‌రెడ్డికి సమస్యలు వివరిస్తున్న వైసీపీ నాయకులు

జమ్మలమడుగు, సెప్టెంబరు 17: జమ్మలమడుగు వైసీపీ కార్యాలయంలో మంగళవారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు ఎంపీ అవినాశ్‌రెడ్డి నిర్వహించిన ప్రజాదర్బార్‌లో పలువురు వైసీపీ నేతలు సమస్యలపై ఎంపీని నిలదీశారు. ఎంపీతో పాటు మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి వస్తున్నారని తెలిసి పలు గ్రామాల నుంచి వైసీపీ కార్యకర్తలు, నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కొందరు మాట్లాడుతూ.. మిమ్మల్ని నమ్ముకుని గ్రామాల్లో ఏజెంట్లుగా కూర్చున్నామని జమ్మలమడుగులో తమకు ఏమైనా జరిగితే దిక్కెవరని ప్రశ్నించారు. ధర్మాపురం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు, అతని అన్న కుమారుడు మాజీ ఎమ్మెల్యేపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమపై దాడి జరిగితే ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదని, ఇలా ఉంటే గ్రామాల్లో ఎలా ఉండాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన కార్యాలయంలోకి వచ్చి తనపైనే ఇలా మాట్లాడుతావా అంటూ మాజీ ఎమ్మెల్యే ఎదురు ప్రశ్న వేసినట్లు తెలిసింది. అనంతరం పి.బొమ్మేపల్లె, మైలవరం, పెద్దముడియం మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు వారి సమస్యలను ఎంపీకి వివరించారు. బొమ్మేపల్లె వద్ద జగనన్న కాలనీలో తలెత్తిన వివాదంపై బాధితులను తీసుకుని ఎంపీ ఆర్డీవో కార్యాలయాలనికి వెళ్లి ఆర్డీవో శ్రీనివాస్‌ను కలిసి సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు మల్కిరెడ్డి హనుమంతరెడ్డి, కోఆప్షన్ మెంబర్ గజ్జెల లక్ష్మయ్య, పట్టణ అధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఆర్మీ జవానుమృతి



మృతిచెందిన ఆర్మీ జవాను సుబ్బారావు (ఫైల్), అధికారిక లాంఛనాలతో అంతిమ సంస్కారాలకు తరలిస్తున్న ఆర్మీజవాన్లు, బంధువులు

వేంపల్లె, సెప్టెంబరు 17: వేంపల్లె శ్రీరామ్‌నగర్‌కు చెందిన చల్లా సూర్యనారాయణ, వెంకటమ్మ కుమారుడు చల్లా సుబ్బారావు (40) ఆర్మీలో పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందాడు. ఈనెల 15న అరుణాచల్‌ప్రదేశ్‌లో విధులు నిర్వర్తిస్తూ అకస్మాత్తుగా అనారోగ్యానికి గురై మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. 18 సంవత్సరాల పాటు ఆర్మీలో విధులు నిర్వర్తించిన సుబ్బారావుకు భార్య రేణుక, ఇద్దరు పిల్లలు హేమ, జగదీష్‌లు ఉన్నారు. జవాను సుబ్బారావు మృతదేహన్ని ప్రత్యేక వాహనం ద్వారా మంగళవారం వేంపల్లెకు తీసుకొచ్చి.. అధికార లాంఛనాలతో అంతిమసంస్కారాలు నిర్వహించారు.

నలుగురు తమిళ స్మగ్లర్లు అరెస్టు

కడప క్రైం, సెప్టంబర్ 17 కడప రేంజ్ మద్దిమడుగు అటవీ ప్రాంతంలో ఎర్రచందనం దుంగలు అక్రమ రవాణాకు పాల్పడుతున్న నలుగురు తమిళ స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు కడప రేంజ్‌ఫారెస్టు అధికారి ప్రసాద్ తెలిపారు. మంగళవారం మీడియాకు తెలియపరిచారు. తమిళనాడు రాష్ట్రం సేలంకు చెందిన ధనరాజ్, గోపినాథ్, గుణశేఖరన్, ధర్మపురికి చెందిన వెంకటేశన్, కడప రవీంద్రనగర్‌కు చెందిన ఎస్.శామీర్‌బాలను అరెస్టు చేసినట్లు తెలిపారు. సుగాలిబిడికికి చెందిన బాబు నాయక్ పారిపోయాడని, నిందితుల నుంచి 18 దుంగలు, కారు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

పోగొట్టుకున్న బ్యాగును అప్పగించిన పోలీసులు

కడప (క్రైం), సెప్టెంబరు 17: ఆటోలో వెళుతూ నగదు, బంగారు నగలు ఉన్న బ్యాగును పోగొట్టుకున్న మహిళకు తిరిగి కడప ఇన్‌చార్జ్ డీఎస్పీ రమాకాంత్ చేతుల మీదుగా ఆ బ్యాగును టూటౌన్ సీఐ నాగార్జున అందించారు. నకాస్‌కు చెందిన రిజ్వానా దేవునికడప రోడ్డులో ఆటో ఎక్కి ఓల్డ్ రిమ్స్ దగ్గర దిగింది. అదే సమయంలో మరో మహిళ కూడా ఆటోలో ఎక్కింది. రిజ్వానా తన బ్యాగు ఆటోలోనే పడేసుకుని వెళ్లిపోయింది. ఆటోలో ఉన్న మహిళ కొంత దూరం పోయాక పరిశీలించగా ఆటోలో బ్యాగు కనిపించడంతో కడప వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. బాధితురాలు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు పరిశీలించారు. ఆటోను గుర్తించి విచారించగా నగదున్న బ్యాగు పోలీసుస్టేసన్‌లో అప్పగించడంతో వారిని డీఎస్పీ, సీఐలు సత్కరించి బాధితురాలికి నగదు, బంగారు ఉన్న బ్యాగులు అప్పగించారు.

రాష్ట్ర స్థాయి క్యారమ్స్ పోటీలకు అహ్మద్ ఎంపిక

నందలూరు, సెప్టెంబరు 17: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో భాగంగా ఎస్‌జీఎఫ్ అండర్-19 విభాగంలో క్యారమ్స్ పోటీల్లో నందలూరు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి ప్రతిభ చాటి అహ్మద్ రాష్ట్రస్థాయి క్యారమ్స్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఎన్.శ్రీనివాసులు తెలిపారు. ఇటీవల కడప బాలికల జూనియర్ కళాశాలలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో అహ్మద్ ప్రతిభ కనబరచి ఉమ్మడి కడప జిల్లా స్థాయిలో మొదటిస్థానంలో నిలిచారని తెలిపారు.

మంత్రి ప్రజాదర్బార్‌కు పోటెత్తిన ప్రజలు



ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి మండిపల్లి

చిన్నమండెం, సెప్టెంబరు 17: రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మంగళవారం బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌కు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. అన్నమయ్య జిల్లా నుంచే కాక ఇతర జిల్లాల నుంచి కూడా ప్రజాదర్బార్‌కు ప్రజలు పోటెత్తారు. మంత్రి ఉదయం 6 గంటల నుంచి ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తూ కొన్ని సమస్యలకు అక్కడిక్కడ పరిష్కారం చూపారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో ప్రజల సమస్యలు పరిష్కారానికి ఎన్నో కష్టాలు పడేవారని.. నేడు ప్రజాదర్బార్ కార్యక్రమం ద్వారా పరిష్కరిస్తున్నామని తెలిపారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి



కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 17: మానవుల ఆరోగ్యకరమైన జీవన విధానానికి మొక్కలు నాటి పర్యావరణం రక్షించడం అత్యవసరమని రిజిస్ట్రార్ ప్రొఫెసరు రఘునాదరెడ్డి అన్నారు. మంగళవారం వైవీయూలో జంతు శాస్త్ర విభాగం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో తల్లి కోసం ఓ మొక్క స్పెషల్ ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునాధరెడ్డి మాట్లాడుతూ యూనివర్శిటీ అంతా విభిన్న రకాలైన వృక్షజాతులతో విరాజిల్లుతుందన్నారు. మొక్క పెంచే ఉద్యమంలో మన యూనివర్శిటీ కూడా పాల్గొనడం సంతోషకరమన్నారు. ఎన్ఎస్ఎస్ పీవోలు డాక్టర్ సుమిత్ర, వెంకటరమణ, శ్రీధర్ రెడ్డి, చంద్రశేఖర్, వలంటీర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థులు

పుల్లంపేట, సెప్టెంబరు 17 : కడపలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-19 హాకీ పోటీల్లో పుల్లంపేట ఆదర్శ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థిని విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీ విద్యార్థిని మేరి, సీఈసీ విద్యార్థిని హర్షిత, సెకండియర్ ఎంపీసీ విద్యార్థిని మమత, బాలుర విభాగంలో సెకండియర్ ఎంపీసీ విద్యార్థి రోహిత్‌లు కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపల్ లీలా శ్రీహరి, పీడీ నీలకంఠ రావులు తెలిపారు. అలాగే ఎస్‌జీఎఫ్ అండర్-19 ఫుట్‌బాల్ పోటీల్లో కూడా రోహిత్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.

కొండాపురంలో పేలుతున్న ఐపీ బాంబులు

ఇటీవల ముగ్గురు ఐపీ పెట్టడంతో స్థానికుల బెంబేలు

కొండాపురం, సెప్టెంబరు 17: మండలంలో ఐపీ బాంబులు పేలుతుండటంతో స్థానికులు బెంబేలెత్తుతున్నారు. ఇటీవల కాలంలోనే ముగ్గురు ఐపీ దాఖలు చేయడంతో వడ్డీలకు ఇచ్చిన పలువురు ఆందోళన చెందుతున్నారు. మండలంలో కొందరు అధిక వడ్డీలకు ఆశపడి కొంతమంది ప్రముఖులకు డబ్బులు ఇచ్చినట్లు తెలుస్తోంది. గత ఆర్నెళ్ల కాలంలో వరుసగా ముగ్గురు ఐపీ దాఖలు చేయడంతో డబ్బులిచ్చిన పలువురు ఆందోళన చెందుతున్నారు. ఆర్నెళ్ల కిందట పట్టణంలో ఒక పేరు మోసిన ప్రైవేటు పాఠశాల యజమాని సుమారు రూ.3 కోట్లకు ఐపీ దాఖలు చేశాడు.ఇటీవల మరో వ్యాపారి రూ.10 కోట్లకు వరకు ఐపీ దాఖలు చేసినట్లు తెలుస్తోంది. అయితే ఈ వ్యాపారికి సంబంధించి స్థానికంగా కొంతమంది నాయకులు జోక్యం చేసుకొని అతని ఆస్తులు అమ్మి బాకీ ఉన్న వారికి కొంతమేర డబ్బులు చెల్లించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అదేవిధంగా గత రెండు మూడు రోజులగా ఒక ఆర్ఎంపీ డాక్టర్ కూడా రూ.కోటి వరకు ఐపీ దాఖలు చేయనున్నట్లు సమాచారం. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ డాక్టర్‌కు సంబంధించి ముంపు పరిహారం రావాల్సి ఉందని పలువురు చెబుతున్నారు. అదీ ఇప్పటికీ రాకపోవడంతో వడ్డీ వ్యాపారుల ఒత్తిడికి అధిక వడ్డీలు కట్టలేక సదరు ఆర్ఎంపీ డాక్టర్ పరారీలో ఉన్నట్లు సమాచారం. దీంతో వడ్డీలకు ఇచ్చిన పలువురు ఆందోళన చెందు తున్నారు. కొంతమంది వడ్డీ వ్యాపారులు ఇష్టం వచ్చినట్లు అధిక వడ్డీలు వసూలు చేస్తుండటంతో వడ్డీలు కట్టలేక, చేసేది లేక పలువురు ఐపీ దాఖలు చేసినట్లు తెలుస్తోంది.

ఒమన్ నుంచి స్వదేశానికి..

● మహిళను 24 గంటల్లోనే రప్పించిన ఎస్పీ



ఎస్పీని కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న షహీనా, ఆమె భర్త, పిల్లలు

రాయచోటి టౌన్, సెప్టెంబరు 17: ఒమన్ దేశంలో తమ తల్లి ఇబ్బందులు పడుతోందని, వెంటనే ఇండియాకు రప్పించాలని బాధితురాలి పిల్లలు, భర్త ఎస్పీని కోరడంతో వెంటనే స్పందించిన ఆయన 24 గంటల్లోనే ఆ మహిళను స్వదేశానికి రప్పించారు. వివరాలిలా ఉన్నాయి. గాలివీడు మండలం పెద్దూరు గ్రామానికి చెందిన హసనాపురం షహీన బతుకుదెరువు కోసం ఈ ఏడాది ఆగస్టు 25న హైదరాబాద్ నుంచి ఒమన్‌కు వెళ్లింది. ఏజెంట్ మోసపూరిత వీసా తీయడంతో అక్కడ తీవ్ర ఇబ్బందులకు గురైంది. ఇక్కడ తనను కొట్టి చిత్రహింసలకు గురి చేస్తున్నారని విలపిస్తూ పంపిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఆమె అక్కడ పడుతున్న ఇబ్బందులపై ఆమె భర్తతో పాటు ఇద్దరు పిల్లలు ఈనెల 10న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడుకు సమస్యను చెప్పారు. వెంటనే ఎస్పీ స్పందించి సంబంధిత ఏజెంట్‌తో మాట్లాడి కేవలం 24 గంటల్లోనే బాధితురాలిని స్వదేశానికి రప్పించేలా చర్యలు చేపట్టారు. ఈనెల 11న ఒమన్ నుంచి బయలుదేరిన షహీనా ఈనెల 12వ తేదీ బుధవారం సురక్షితంగా స్వదేశానికి చేరుకున్నారు. దీంతో మంగళవారం షహీనా తన భర్త, పిల్లలతో ఎస్పీని కలిసి కృతజ్ఞతలు తెలిపింది.

విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ.5లక్షల సరుకుల ప్యాకెట్లు తరలింపు



సరుకుల పంపిణీ లారీని జెండా ఊపి ప్రారంభిస్తున్న జిల్లా విద్యుత్‌శాఖాధికారి రమణ

కడప (నాగరాజుపేట), సెప్టెంబరు 17: విజయవాడ వరద బాధితుల సహాయార్థం కడప విద్యుత్ ఉద్యోగుల సామాజిక సేవా సంఘం నడుం బిగించింది. మంగళవారం కడప విద్యుత్ భవన్ నుంచి విజయవాడ వరద బాధితులకు తమవంతు సాయంగా రూ.5.35 లక్షలు విలువ చేసే ఇంటి సరుకులతో కూడిన 750 ప్యాకెట్లను లారీ ద్వారా తరలించారు. ఈకార్యక్రమాన్ని జిల్లా విద్యుత్ శాఖాధికారి ఎస్.రమణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ సామాజిక సేవలో భాగంగా విద్యుత్ ఉద్యోగులు తమ వంతు బాధ్యతగా వరద బాధితులకు అండగా నిలబడటం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కన్‌స్ట్రక్షన్స్ మరియు సామాజిక సేవా సంఘం అధ్యక్షుడు డి.నాగరాజు, సేవా సంఘం జనరల్ సెక్రటరీ ఎంవీ చలపతి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు టెక్నికల్ హరిసేమనాయక్, అధికారులు, విద్యుత్ సిబ్బంది, అన్ని యూనియన్ల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యలో నైపుణ్యాలపై వర్క్‌షాపు

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 17 : ఉన్నత విద్యలో నైపుణ్యం ఆధారిత పాఠ్యాంశాలపై వైవీయూలో ఈ నెల 26, 27 తేదీల్లో రెండురోజుల జాతీయ వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్టారెడ్డి, రిజిస్ట్రారు ప్రొఫెసరు రఘునాధరెడ్డి తెలిపారు. మంగళవారం వైవీయూలో వర్క్‌షాపునకు సంబంధించిన పోస్టరును ఆవిష్కరించారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ తిరుపతి ప్రొఫెసరు సునీల్‌కుమార్ కీలక ఉప న్యాసం చేయనున్నారని తెలిపారు. ఈ వర్క్‌షాపులో పాల్గొనేందుకు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 8309276615, 8106604789, 8639648721 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

పడకేసిన 'ప్రభుత్వ' వైద్యం

● విషజ్వరాల బాధితులతో ఆసుపత్రులు కిటకిట ● సరైన వైద్యం అందక పేద ప్రజలు ఇక్కట్లు
● ప్రైవేటు ఆసుపత్రుల వైపే మొగ్గు

వైద్య రంగం పై ప్రభుత్వం దృష్టి పెట్టినా, క్షేత్రస్థాయిలో సిబ్బంది అలసత్వం, డాక్టర్ల ఉదాసీనత, సరైన మందులు, కనీస సౌకర్యాల లేమితో ఆస్పత్రులు కునారిల్లుతున్నాయి. దీంతో విధిలేని పరిస్థితుల్లో పది శాతం మంది మాత్రమే ప్రభుత్వ వైద్యశాలలను సందర్శిస్తుం డగా, మిగిలిన 90 శాతం మంది ప్రైవేటు ఆసుపత్రుల వై పే మొగ్గు చూపుతున్నారు. ఈ నేపథ్యంలో రాజంపేట, రైల్వేకోడూరు రాయచోటి నియోజకవర్గాల పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రులను మంగళవారం ఆంధ్రజ్యోతి క్షేత్రస్థాయిలో పరిశీలించింది.



రాజంపేట ఏరియా ఆసుపత్రిలో వైద్యం కోసం బారులుతీరిన రోగులు

రాజంపేట, సెప్టెంబరు 17: రాజంపేట ఏరియా ఆసుపత్రిని ప్రతి రోజూ సుమారు 500 మంది రోగులు సందర్శిస్తుంటారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ సక్రమంగా విధులకు హాజరు కారన్న ఫిర్యాదులున్నాయి 21 మంది డాక్టర్లు అవసరం కాగా, 16 మంది మాత్రమే ఉన్నారు. 24 మంది స్టాఫ్‌నర్సులకు 18 మంది మాత్రమే ఉన్నారు. బ్లడ్‌బ్యాంకు లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో తిరుపతి, కడపకు వెళ్లాల్సి వస్తోంది. వారం రోజులుగా విషజ్వరాల బాధితులతో ఆసుపత్రి కిటకిటలాడుతోంది. నందలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాని కి రోజూ 50 దాకా ఓపీ ఉంటుంది. ఇద్దరు డాక్టర్లున్నా కనీస సౌకర్యాలు లేవు. మందుల కొరత వేధిస్తోంది. మంగళవారం ఒక డాక్టరు మాత్రమే విధులకు హాజరయ్యారు. ఒంటిమిట్ట ఆస్పత్రిలో ఇద్దరు డాక్టర్లు ఉన్నా, కనీస సౌకర్యాలు లేవు. విషజ్వరాలు అధికంగా ఉండడంతో రోగులతో ఆసుపత్రి కిటకిటలాడుతోంది. సిద్దవటం ఆరోగ్య కేంద్రాన్ని పారిశుధ్య సమస్య వేధిస్తోంది. మాధవరం, పొన్నేలు ఆసుపత్రుల్లో కనీస సౌకర్యాలు కూడా లేకపోవడంతో రోగులు వైద్యం కోసం జిల్లా కేంద్రానికి వెళుతున్నారు. సుండుపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఒకే గది ఉంది. మూడు పడకలు ఉన్నా అవి వినియోగంలో లేవు. ఉన్న ఒక్క గదికి ఎప్పుడూ తాళం వేసి ఉంచడం వల్ల ఉపయోగం లేకుండా ఉంది. మండలంలో నలుగురు డాక్టర్లు ఉన్నా సరైన వైద్యం అందక రాయచోటికి వెళుతున్నారు. డాక్టర్లు సమ్మెలో ఉండడంతో వీరబల్లి మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం రోగులు చికిత్స కోసం రాయచోటికి వెళ్లిపోయారు. రైల్వేకోడూరులోని కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో ఐదుగురు డాక్టర్లు పనిచేస్తున్నారు. 8 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా 3 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మురుగు కాలువలు లేకపోవడంతో ప్రాంగణం దుర్గంధభరితంగా మారింది. దోమలు ప్రబలి ఆసుపత్రి ప్రాంగణమే అనారోగ్యానికి నిలయంగా మారింది. చిట్వేలిలో ఆసుపత్రి భవనం ఉరుస్తుంది. ఇక్కడ కొత్త భవన నిర్మాణం పూర్తై 3 నెలలవుతున్నా ప్రారంభించకపోవడంతో పాత భవనంలోనే విధులు కొనసాగిస్తున్నారు. పెనగలూరులో ఇద్దరు డాక్టర్లు, 14 మంది సిబ్బంది ఉన్నా ఆసుపత్రి ప్రాంగణం అపరిశుభ్రంగా ఉంది. ఓబులవారిపల్లె మండలంలో ఓబులవారిపల్లె, వై.కోట, ప్రాథమిక కేంద్రాల్లో కనీస సౌకర్యాలు లేవు. వై.కోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులు కూర్చోవడానికి కూడా అవకాశం లేదు. ఓబులవారిపల్లెలో ఇదే పరిస్థితి ఇక్కడ ఇద్దరు డాక్టర్లు, వైద్యసిబ్బంది ఉన్నా ఆశించిన వైద్యం అందడంలేదు. సుమారు వంద మందికి పైబడి రోజువారి వైద్యం కోసం వస్తున్నా వైద్యం అంతంత మాత్రమే అందుతుంది. పుల్లంపేటలో ఇద్దరు డాక్టర్లు ఉన్నారు. మంగళవారం నిరసన వ్యక్తం చేస్తూనే సేవలందించారు. మండలంలో ఎక్కువగా విషజ్వరాలు ప్రబ లి ఉన్నాయి. ఏది ఏమైనా ప్రభుత్వ వైద్యం ప్రజలకు సక్రమంగా అంద డంలేదన్నది సుస్పష్టం.

సంబేపల్లె: రాయచోటి, లక్కిరెడ్డిపల్లె మండల కేంద్రాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యాధికారులు ప్రజలకు అందుబాటులో ఉన్నారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో వైద్యులు సమయపాలన పాటించలేదు. రాయచోటి ఏరియా ఆసుపత్రిలో ఉదయం 10.45కు కూడా వైద్యులు రాలేదు. సిబ్బంది రాకపోవడంతో గర్భిణులు స్కానింగ్ సెంటర్ల వద్ద 'క్యూ కట్టారు. లక్కిరె డ్డిపల్లె కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో 8 మంది వైద్యులు ఉండగా మధ్యాహ్నం 12 గంటలకే ఏడుగురు వైద్యులు వెళ్లిపోయారు. ఒక వైద్యుడు మాత్రమే నాలుగు గంటల వరకు విధులు నిర్వహించారు. సంబేపల్లె మండలం దేవపట్ల ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులు సమ్మెలో ఉన్నా వైద్య సేవలందించారు. సంబేపల్లె పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు విధులకు హాజరయ్యారు. చిన్నమండెంలో వైద్యులు రాకపోవడంతో రోగులు వేచి చూశారు. గాలివీడు మండలంలోని రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు సమ్మెలో ఉండడంతో సిబ్బంది సేవలందించారు. రామాపురం ప్రాథ మిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సెలవుపై ఉండడంతో మరో వైద్యు రాలు విధులకు హాజరయ్యారు.

ఆంధ్రజ్యోతి విజిట్



రాయచోటి ఆసుపత్రిలో వైద్యులు రాక ఖాళీగా ఉన్న కుర్చీలు

ముదివీడు నిర్వాసితులకు పరిహారం చెల్లించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ముదివీడు నిర్వాసితులు

రాయచోటి (కలెక్టరేట్) సెప్టంబరు 17: ముదివీడు రిజర్వాయర్ నిర్వాసితులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయం వద్ద బాధితులతో కలసి నిర సన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ ప్రాజెక్టుకు తీసుకున్న భూముల యజమా నులకు నష్టపరిహారం చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారని అవేదన వ్యక్తం చేశారు. ప్రతి రైతు కుటుంబానికి 5 సెంట్ల స్థలం, ఇళ్ల నిర్మాణానికి 25 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూమి లేని రైతులకు 5 లక్షలు, భూములు కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయంగా భూములు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ విష యంపై జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎ.రామాంజులు, సురేంద్ర రెడ్డి, మారప్ప, ఆంజినేయులు, రమణ పాల్గొన్నారు.

నిరుపేద దళిత, గిరిజనులకు భూములు పంచాలి

రైల్వేకోడూరు, సెప్టెంబరు 17: నిరుపేద దళిత, గిరిజనులకు ప్రభుత్వ బంజరు భూములు పంచాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మొగిలి వినయ్ కోరారు. మంగళవారం సీపీఐ రైల్వేకోడూరు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుపేద దళిత, గిరిజనులకు దక్కవలసిన భూములను అగ్రవర్ణాలు లాక్కుని పోతున్నాయన్నారు. పెత్తందారులు, భూ బకాసురులు పేదల భూములను అనుభవిస్తున్నారని తెలిపారు. రెవెన్యూ శాఖ అధికారులకు రాజకీయ నాయకులు, బడా రైతులు ముడుపులిచ్చి నిరుపేదల భూములు ఆక్రమించుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో భూ కబ్జాలు పెరుగుతున్నాయన్నారు. నిరుపేద ప్రజలకు బంజరు భూములు ఇవ్వాలని ఈ నెల 18న రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయం ముట్టడి నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో నాయకులు తిప్పన ప్రసాద్, మహిళా నాయకురాలు ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పట్టాలున్నా పొమ్మంటున్నారు : దళితుల ఆందోళన

రాయచోటి (కలెక్టరేట్) సెప్టెంబరు 17: ఇళ్లు వదలిపోవాలంటూ అగ్రకులాల వారు బెదిరిస్తున్నారంటూ రాజంపేట మండలం కొల్లావారి పంచాయితీ అరుంధతివాడలోని దళితులు మంగళవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. చాలా కాలంగా తాము ఆ కాలనీలో నివసిస్తున్నామని, ఈ స్థలాలకు సంబంధించి గతంలో తమకు పట్టాలు కూడా ఇచ్చారని తెలిపారు. ఈ మధ్య కాలంలో అగ్రవర్ణాలకు చెందిన కొందరు తమను అక్కడి నుంచి వెళ్లిపోవాలని బెదిరించడంతోపాటు దాడులు చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు శ్రీనివాసులు, రామాంజులు, అరుంధతి వాడ ప్రజలు పాల్గొన్నారు.

ఫిర్యాదులను త్వరగా పరిష్కరిస్తాం

రాయచోటిటౌన్, సెప్టెంబరు17: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరిస్తామని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు అన్నారు. మంగళవారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. 18 మంది నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. అర్జీలను చట్ట పరిధిలో విచారించి త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు.

ఆ టీచర్.. మాకొద్దు!

● డీఈవో, కలెక్టర్‌కు విద్యార్థుల ఫిర్యాదు

వీరబల్లి, సెప్టెంబరు17: తెలుగు ఉపాధ్యాయురాలు బ్యూలారాణి తమకొద్దంటూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, విద్యా కమిటీ చైర్‌పర్సన్ శ్రీవాణి మంగళవారం పాఠశాలలో ఆందోళన చేశారు. తరగతి గదిలో పాఠాలు చెప్పకపోగా, విద్యార్థులను దూషించడంతోపాటు కొడుతోందని, దీనికితోడు మత ప్రచారం చేస్తోందని విద్యార్థులు తెలిపారు. గతంలో ఈమె పనిచేసిన పాఠశాలల్లో కూడా ఫిర్యాదులు అందడంతో మెమోలు జారీ అయ్యాయన్నారు. అలాంటి ఉపాధ్యాయురాలు తమకు వద్దని జిల్లా కలెక్టర్‌కు, డీఈవో, ఎంఈవోకు ఫిర్యాదులు చేసినట్లు తెలిపారు. గతంలో పనిచేసిన తెలుగు ఉపాధ్యాయుడు రాంమోహన్‌ను డెప్యుటేషన్‌పై పెద్దివీడుకు పంపారని, ఆయన డిప్యుటేషన్‌ను రద్దు చేసి తమ పాఠశాలకు బదిలీ చేయాలని వారు కోరారు. తెలుగు ఉపాధ్యాయురాలు బ్యూలారాణిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ విషయమై ఎంఈవో కృష్ణయ్యను, హెచ్‌ఎం ఆర్. చంద్రశేఖర్‌ను వివరణ కోరగా... విద్యార్థులు, తల్లిదండ్రులు, తల్లిదండ్రుల కమిటీ ఫిర్యాదు చేసిన మాట వాస్తవమేనన్నారు. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలియజేసినట్లు తెలిపారు.

రెండు రోజుల పాటు రైల్వే గేట్ల మూసివేత

రైల్వేకోడూరు, సెప్టెంబరు 17: మండలంలోని చలపాళెం నుంచి చెన్నరాజుపోడు గ్రామానికి వెళ్లే రైల్వే గేటును మరమ్మతుల కారణం ఈ నెల 19, 20 తేదీల్లో మూసి వేస్తున్నట్లు రైల్వే సీనియర్ సెక్షన్ అధికారి అఖిలేష్‌కుమార్ మంగళవారం తెలిపారు. వాహన దారులు ఇతర దారుల్లో తమతమ గ్రామాలకు వెళ్లాలని వారు కోరారు.

ఉపాధ్యాయుడిపై కేసు నమోదు

గాలివీడు, సెప్టెంబరు17: విద్యార్థిని కొట్టిన ఉపాధ్యాయుడిపై విద్యార్థి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. మండల కేంద్రంలో జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు రవి అదే పాఠశాలలో చదువుతున్న ఒక విద్యార్థిపై చేయి చేసుకున్నాడని అతని తండ్రి ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

పోస్టల్ పీఎల్‌ఐ పై అవగాహన

చిట్వేలి, సెప్టెంబరు 17 : పోస్టల్ పీఎల్‌ఐ, ఆర్పీఎల్‌ఐపై స్థానిక సబ్ పోస్టాఫీసులో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కడపజిల్లా డివిజన్ పీఎల్‌ఐ అభివృద్ధి అధికారి మునాఫ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈనెల 25, 26 తేదీల్లో పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, గ్రామీణ ప్రాంత తపాలా జీవిత బీమాలపై జరగనున్న మేళాపై గ్రామీణ ప్రాంత సిబ్బందికి అవగాహన కల్పించామన్నారు.

విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

● రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, సెప్టెంబరు17: విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఆయన పట్టణంలోని అలీమాబాద్ వీధిలోని ఉర్దూ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాం దుస్తులు, విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి మాటాడుతూ మన రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. సమాజ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు చదువుతో పాటు వినయం, విధేయత, సంస్కారం, మానవతా విలువలను కూడా నేర్పించాలన్నారు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి విద్యనభ్యసించి తమ తల్లిదండ్రులకు తమ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని, క్రీడల్లో రాణించడం వల్ల విద్య ఉద్యోగాల్లో వారికి మొదటి ప్రాధాన్యం లభిస్తుందన్నారు. ఉర్దూ పాఠశాల లో క్రీడాపరికరాల కొనుగోలు తన సొంత నిధుల నుంచి రూ.50 వేలు ఇస్తానన్నారు. ఉర్దూ పాఠశాలకు రోడ్డు సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్కూల్ కిట్స్ పంపిణీ చేస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

చిన్నమండెం: మండలంలోని కలిబండ హరిజనవాడలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి నూతన బోరును ప్రారంభించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారమే లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 90 రోజులకే రాయచోటి నియోజకవర్గంలో దాదాపు 56 బోర్లు వేశామన్నారు.

పర్యావరణ పరిరక్షణ కూటమి ప్రభుత్వ లక్ష్యం

● రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్

స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా అన్ని మండలాల్లో మంగళవారం అధికారులు, విద్యార్థులు, నాయకులు పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పిస్తూ ర్యాలీలు నిర్వహించారు. మానవహారం ఏర్పాటు చేశారు. వీధులను శుభ్రం చేశారు. మొక్కలు నాటారు.

రైల్వేకోడూరు, సెప్టెంబరు 17: పర్యావరణ పరిరక్షణే కూటమి ప్రభుత్వ లక్ష్యమని జనసేన పార్టీ ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తెలిపారు. మంగళవారం రైల్వేకోడూరు మండలంలోని ఉర్లగట్టుపోడు పంచాయతీ వైఎస్‌ఆర్ కాలనీలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి అధికారులు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.సర్పంచ్ గోపీ, రైల్వేకోడూరు ఎంపీడీవో జాషువా, హౌసింగ్ శాఖ ఇన్‌చార్జ్ డీఈఈ మురళీకృష్ణ, నార్జాల హేమరాజ్, తేనేపల్లి చిన్నా తదితరులు పాల్గొన్నారు.

రామాపురం: ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ, మూడు రోడ్ల కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. ఎంఈవో రామకృష్ణుడు, జయచంద్ర, ఈవోపీఆర్‌డీ ఉషారాణి, ఏపీఎం దేవసేన, ఏపీవో పెంచలయ్య, ఈసీ శివయ్య, రెవెన్యూ, ఆరోగ్య, వెలుగు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సుండుపల్లి: ఎంఈవో రవీంద్ర నాయక్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మండల టీడీపీ నాయకులు శివరామిరెడ్డి, శివరాం నాయుడు, చెన్నంశెట్టి రమణ, రామాంజులు, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రామాజగదీష్, జనసేన నాయకురాలు రెడ్డిరాణి, రామా శ్రీనివాసులు, ఈవోపీఆర్డీ సురేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి సురేష్‌బాబు, హెడ్మాస్టర్ జయన్న పాల్గొన్నారు.

గాలివీడు: ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. వైస్ ఎంపీపీ యదుభూషణ్‌రెడ్డి, ఎంఈవో నాగరాజు, పంచాయతీ కార్యదర్శి సురేశ్, వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వేకోడూరు(రూరల్): ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఎంపీడీవో జాషువా, పంచాయతీ ఈవో ప్రసాద్‌రావు, మాజీ ఉప సర్పంచ్ నార్జాల హేమరాజ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె; లక్కిరెడ్డిపల్లె జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించి మూడు రోడ్ల కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. ఎంపీడీవో వెంకటరామిరెడ్డి సీడీపీవో పద్మావతి, హెచ్‌ఎంలు సర్పంచు చంద్రమ్మ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు

వీరబల్లి: మండలంలోని అన్ని పంచాయతీల్లో ఆయా సర్పంచులు, టీడీపీ నాయకులు, అధికారులు మంగళవారం స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో రామచంద్రారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు భానుగోపాల్‌రాజు, నాయకులు పాల్గొన్నారు.

సంబేపల్లె: దుద్యాల సర్పంచ్ ఎద్దుల లక్ష్మీదేవి, ఆమె భర్త చిన్నప్ప పంచాయతీ సెక్రటరీ మోహన్‌బాబు చెత్తబుట్టలను పంపిణీ చేశారు.

చిన్నమండెం: చాకిబండ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు, ప్రధానోపాధ్యాయుడు శివయ్య ఆధ్వర్యంలో మానవహారం ఏర్పాటుచేశారు.



రాయచోటిలో స్వచ్ఛతా హి సేవ అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న డీపీవో ధనలక్ష్మి

నందలూరు : నాగిరెడ్డిపల్లె సర్పంచ్ జంబు సూర్యనారాయణ, ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.

పుల్లంపేట: మానవహారం ఏర్పాటు చేశారు. ఏవో హబీబుల్లాఖాన్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

ఓబులవారిపల్లె: ఎంపీడీవో విజయ్‌రావు, ఈవోఆర్డీ, పంచాయతి కార్యదర్శి భారతి, ఏటీఎం ఆర్ముగం, టీడీపీ నాయకుడు వాసుదేవరెడ్డి, పాల్గొన్నారు.

చిట్వేలి: చిట్వేలి సర్పంచ్ దండు లక్ష్మీ, ఎంపీడీవో మోహన్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. పంచాయతి కార్యదర్శి రామసుబ్బారెడ్డి, ఈవోపీఆర్డీ శివకుమార్ పాల్గొన్నారు.

స్వచ్ఛ రాయచోటి సాధనకు కృషి చేయాలి

రాయచోటిటౌన్ : స్వచ్ఛ రాయచోటి సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారిణి ధనలక్ష్మి, జెడ్పీ డిప్యూటీ సీఈవో జీవీ రమణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ వాసుబాబులు పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులతో కలిసి స్వచ్ఛతాహి సేవ అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్యాలయం నుండి బస్టాండు గుండా నేతాజీ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేశారు. బంగ్లా సర్కిల్‌లో రోడ్లను శుభ్రపరిచి స్వచ్ఛ సంకల్పం తీసుకున్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పారిశుధ్య కార్మికుల మెడికల్ క్యాంపును జిల్లా అధికారులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, కౌన్సిలర్ మదన్‌మోహన్‌రెడ్డి, డీఈవో శివప్రకాశ్‌రెడ్డి, జిల్లా పశుసంవర్థకశాఖ అధికారి గుణశేఖర్‌పిళ్లై, డీడీ మాలకొండయ్య, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, నోబెల్ టీచర్స్ అసోసి యేషన్ రాష్ట్ర బాధ్యులు కొండూరు శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది మెరుగైన సేవలందించాలి

రాయచోటిటౌన్, సెప్టెంబరు17: సచివాలయ సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని ఎగువ అబ్బవరంలో గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయానికి వచ్చే సమస్యలకు ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలన్నారు. జాప్యం లేకుండా పారదర్శకంగా సేవలందించాలని, అప్పుడే ప్రజలకు ప్రభుత్వంపై నమ్మకం కలుగుతుందన్నారు. సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లిని ఎగువ అబ్బవరం గ్రామ ప్రజలు గజమాలతో ఘనంగా సన్మానించారు.

నులి పురుగులతోనే పిల్లల్లో రక్త హీనత



విద్యార్థులకు మాత్రలు వేస్తున్న ఎమ్మెల్యే అరవశ్రీధర్

రైల్వేకోడూరు, సెప్టెంబరు 17: పిల్లల్లో రక్తహీనతకు కారణం నులిపురుగులే అని రైల్వేకోడూరు జనసేన పార్టీ ఎమ్మెల్యే అరవ శ్రీ.దర్ తెలిపారు. మంగళవారం మండలంలోని ఉర్లగట్టుపోడు వైఎస్‌ఆర్ కాలనీలో పిల్లలకు నులిపురుగుల మందు బిళ్లలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు తల్లిదండ్రులు ప్రతి మూడు నెలలకు ఒకసారి నులిపురుగుల మందు బిళ్ల లను వేయాలని సూచించారు. దీంతో పిల్లల్లో రక్తహీనత రాకుండా ఉంటుందన్నారు. ప్రైవేటు, ప్రభుత్వ, పాఠశాలలు, కళాశాలలకు నులిపురుగుల మందు బిళ్లలు ఇస్తున్నట్లు వైద్యురాలు ఉషశ్రీ తెలిపారు. ఉప్పరపల్లె ప్రాథమిక పాఠశాలలో విద్యా ర్థులకు మందు బిళ్లలు పంపిణీ చేశారు. వైద్యులు రమేష్, అయేషా, సూపర్‌వైజర్లు బాలక్రిష్ణంరాజు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సుండుపల్లి: మండలంలోని పించా విద్యార్థులకు ఎంపీహెచ్‌ఈవో వీరనారాయణ నులి పురుగుల నివారణ మందులు వేశారు. రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి మందగించడం, కడుపు నొప్పి, వాంతులు, విరేచనాలు నులి పురుగులతో వచ్చే సమస్యలని వివరించారు. ప్రతి విద్యార్థి చేతులు శుభ్రంగా కడుక్కుని భోజనం చేయాలన్నారు. హెచ్‌యం ప్రకాష్ నాయక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సంబేపల్లె: ఆల్బెండజోల్ మాత్రలతో విద్యార్థుల్లో రక్తహీనతను నియంత్రించి వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించవచ్చునని ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 476 మంది విద్యార్థులకు మందు ఇల్లలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్ వరలక్ష్మి, ఆశావర్కర్ లక్ష్మీదేవి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల తనిఖీ

చిన్నమండెం, సెప్టెంబరు17: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రాథమిక ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశాన్ని అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాశ్‌రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రతి ఉపాధ్యాయుడు తనను తాను ఉన్నతీకరించుకోవాలని వివిధ ఆన్‌లైన్ కోర్సులు ముఖ్యంగా దీక్ష యాప్ ద్వారా విద్యా కార్యక్రమాలను పూర్తి చేయాల్సి ఉంటుందని, అలాగే కాంప్లెక్స్ సమావేశాను సద్వినియోగం చేసుకుని ఇక్కడ తెలుసుకున్న విషయాలను తరగతి గదిలో అమలుచేయాలని తెలియజేశారు. బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో అంజనేయులునాయుడు, ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం

రాయచోటి(కలెక్టరేట్) సెప్టంబర్ 17: పేదవాడి సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం అని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అన్నారు. మంగళవారం ప్రధాన మంత్రి ఆవాస్‌యోజన 2.0 విధి విధానాలను ప్రారంభించిన అనంతరం భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిర్వహించిన వర్చువల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ- ఇల్లు లేని ప్రతి ఒక్కరికి ఇల్లు ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఇప్పటి వరకు మంజూరైన ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలన్నారు. హౌసింగ్ పీడీ శివయ్య, ఆ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీతోనే అగ్రరాజ్యాలతో పోటీ

రైల్వేకోడూరు, సెప్టెంబరు 17: దేశం అగ్రరాజ్యాలతో పోటీ పడాలంటే ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ అవసరం అని బీజేపీ రైల్వేకోడూరు ఇన్‌చార్జి గడ్డం చంగల్‌రాజు తెలిపారు. మంగళవారం రైల్వేకోడూరులో నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా కేక్ కట్‌చేసి, పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ హయాంలో దేశం అభివృద్ధి సాధించిందన్నారు. విశ్వ హిందూ పరిషత్ అధ్యక్షుడు దరిశావెంకటరెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు పులపుత్తూరు రామసుబ్బారెడ్డి, వాకచర్ల సుబ్బారావు, తోట శ్రీనివాసులు, జోగినేని సుబ్బారావు, వీటీ చంగల్‌రెడ్డి, జయప్రకాష్ నారాయణ వర్మ, శంకర్‌రాజు, శ్రీధర్, వెంకటేష్, చలపతి తదితరులు పాల్గొన్నారు.

సుండుపల్లి: బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రామా జగదీష్ ఆధ్వర్యంలో కూడలి వద్ద కేక్ కట్ చేశారు. టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

రాయచోటి టౌన్: బీజేపీ సీనియర్‌నేత అరమాటి శివగంగిరెడ్డి ఆధ్వర్యంలో రాయచోటిలో కేక్ కట్ చేశారు.



రైల్వేకోడూరు: అన్నదానం చేస్తున్న బీజేపీ నాయకులు

లక్కిరెడ్డిపల్లె: బీజేపీ సీనియర్ నాయకుడు కృష్ణ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేశారు. జయచంద్రనాయుడు, రామచంద్ర, గంగయ్య, కే రెడ్డెన్న, శ్రీనివాసులు, ఆదినారాయణ, వెంకటరమణ, లక్ష్మి నారా యణ తదితరులు పాల్గొన్నారు

ఓబులవారిపల్లె : బీజేపీ నాయకులు చిన్‌రెడ్డి రాజగోపాల్ రెడ్డి, గోవర్ధన్‌రెడ్డిల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. యువ నాయకులు చిన్‌రెడ్డి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వ ర్యంలో జీవీపురం వైసీపీ ఎంపీటీసీ పత్తూరు ఈశ్వరమ్మ బీజేపీ కండువా కప్పుకున్నారు. ఫణీంద్ర, పల్ల నారాయణ, జనసేన యువనాయకుడు కటికం నాగేంద్ర పాల్గొన్నారు.

గోవిందంపల్లె టోల్‌గేటు వేలం ప్రకటన రద్దు

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 17: మండల పరిధిలోని గోవిందపల్లె గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ముగ్గురాయి టోల్‌గేటు వసూలు చేసుకునే హక్కులకు ఈ నెల 18న నిర్వహించనున్న వేలం అనివార్య కారణాలతో రద్దైంది. ఈ మేరకు డీపీవో, గోవిందంపల్లె పంచాయతీ అధికారులు ప్రకటించినట్లు పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్, గ్రామ సర్పంచ్ ధనలక్ష్మి తెలియజేశారు.

సీబీఎస్ఈపై దుష్ప్రచారం ఆపాలి

నందలూరు, సెప్టెంబరు 17 : రాష్ట్రంలో సీబీఎస్ఈ సిలబస్‌ను రద్దు చేస్తున్నట్లు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తప్పుడు ప్రచారం ఆపాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్ అన్నారు. మంగళవారం నందలూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉపాధ్యాయులకు కనీస శిక్షణ ఇవ్వకుండా సీబీఎస్ఈ సిలబస్ ప్రవేశపెట్టి జగన్ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంవత్సరం సీబీఎస్ఈ సిలబస్‌లో పదో తరగతి పరీక్ష విద్యార్థులకు మోడల్ పరీక్షలు నిర్వహించగా దాదాపు 80 శాతం మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారని, ఉపాధ్యాయులు ఈ విషయాన్ని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ దృష్టికి తీసుకు వచ్చారన్నారు. స్పందించిన మంత్రి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని 2024-25 సంవత్సరంలో పదో తరగతి పరీక్షలను రాష్ట్ర బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారన్నారు. విద్యార్థుల భవిష్యత్ కోసం తీసుకున్న నిర్ణయాన్ని సీబీఎస్ఈ సిలబస్ రద్దు చేస్తున్నట్లు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. జగన్ ఎన్ని తప్పుడు ప్రచారాలు చేసినా ఎవరూ నమ్మే పరిస్థితులు లేవ న్నారు. ఇప్పటికైనా తప్పుడు ప్రచారాలు ఆపాలని హితబోధ చేశారు. టీఎన్ఎస్ఎఫ్ నేత కంత్రి శివ, సీఎంసీ చైర్మన్ ఈరి వేణుగోపాల్ పాల్గొన్నారు.


పుస్తకావిష్కరణ చేస్తున్న ఎంపీ, తదితరులు

యువతకు ప్రధాని మోదీ ఆదర్శం

ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 17: యువతకు ప్రధాని మోదీ ఆదర్శమని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. జనజాగృతి స్వచ్ఛంద సంస్థ, బీజేపీ నాయకుడు చిట్టిబాబు ఆధ్వర్యంలో స్థానిక నాగయ్యకళాక్షేత్రంలో మోదీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. మోదీ జీవితాన్ని ప్రతిబింబిస్తూ ముద్రించిన భవిష్య మార్గ దర్శనం పుస్తకాన్ని ఆవిష్కరించారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిన మోదీ ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయుడన్నారు. లక్ష్యాన్ని చేరుకోడానికి స్థాయి అడ్డురాదని, పట్టుదల, కృషితోనే గమ్యం చేరుకోగలమన్నారు. పరిశీలకులుగా బీజేపీ అధికార ప్రతినిధి సామంచి శ్రీనివాస్ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్‌నాయుడు, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ శంకర్, మేయర్ అముద, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మేయర్ కఠారి హేమలత, గురజాల చెన్నకేశవ నాయుడు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతికి దరఖాస్తు చేసుకోండి

వేదంలో పట్టభద్రులైన బ్రాహ్మణ యువతకు సూచన

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 17: వేదంలో పట్టభద్రులై నిరుద్యోగులుగా ఉన్న బ్రాహ్మణ యువతకు ప్రతినెలా నిరుద్యోగ భృతి రూ.4వేలు మంజూరు చేయనున్నారని జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షుడు వేణుగోపాల్ తెలిపారు. దీనికోసం అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 81258 87381, 90301 50900 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

పర్యాటక ఎక్సలెన్స్ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు, సెప్టెంబరు 17: పర్యాటక ఎక్సలెన్స్ పురస్కారాల కోసం అర్హుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా పర్యాటక అధికారి మల్లికార్జున్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న జరిగే ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన టూర్స్ ట్రావెల్స్ హోటల్, ప్రభుత్వ సంస్థల వారు పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 22వ తేదీలోగా సమర్పించాలన్నారు. వివరాలకు www.tourism.ap.gov.in సంప్రదించాలని కోరారు.

రేషన్ 20వ తేదీదాకా తీసుకోవచ్చు

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 17: విజయవాడ తదితర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో రేషన్ పంపిణీ గడువును ఈనెల 20వ తేదీ వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను మంగళవారం జారీచేసింది. ఇంత వరకు 87.56 శాతం రేషన్ పంపిణీ జిల్లాలో కొనసాగింది. మిగిలినవారు పెంచిన గడువును దృష్టిలో ఉంచుకుని రేషన్ పొందాలని డీఎస్వో శంకరన్ సూచించారు.

ఆర్టీసీలో అప్రెంటీస్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 17: ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థుల నుంచి ఆర్టీసీలో అప్రెంటీస్‌షిప్‌కు ఈనెల 18వ తేదీనుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్ఎం రాము ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు www.apprenticeshipindia.gov.in వెబ్‌సైట్‌లో అక్టోబరు మూడో తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ పోస్టులకు జిల్లాకు చెందిన వారు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 91542 91408 నెంబరును సంప్రదించాలన్నారు.

మిద్దెపై నుంచి పడి కార్పెంటర్ మృతి


మరణించిన కార్పెంటర్ జయవేలు

పలమనేరు, సెప్టెంబరు17 : ప్రమాదవశాత్తు మిద్దెపై నుంచి జారి పడి ఓ కార్పెంటర్ మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. పలమనేరు మున్సిపాలిటీలోని గంటా వూరు లో నివాసమున్న జయవేలు (51) కార్పెంటర్. ఇతడు మంగళవారం కాలువపల్లిలో పని చేసేందుకు వెళ్లాడు. నూతనంగా నిర్మిస్తున్న ఇంటి మిద్దెపైన పనిచేస్తూ ప్రమాద వశాత్తు కింద పడిపోయాడు. తలకు బలమైన గాయం తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.వంద ఇస్తేనే మస్టర్ వేస్తా

ఉపాధి కూలీలతో ఫీల్డ్ అసిస్టెంట్ మాటల వీడియో వైరల్


కూలీలను బెదిరిస్తున్న మాధవ్

నాగలాపురం, సెప్టెంబరు 17: ఉపాధి పనులు కావాలన్నా.. బిల్లులు మంజూరు చేయాలన్నా కార్డుకు రూ.వంద కట్టాల్సిందే.. లేకపోతే మస్టర్ ఆపేస్తాం.. కూలి డబ్బు రాదు..' అంటూ మండలంలోని ఎస్ఎస్‌పురం గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ మాధవ్ కూలీలను బెదిరిస్తున్న వీడియో ఒకటి వైరల్ అవుతోంది. పై అధికారులు డబ్బు వచ్చిందా అని ఒత్తిడి చేస్తున్నారు.. వారికి నేను ఏమి సమాధానం చెప్పాలి' అంటూ ఆ వీడియోలో హుకుం జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఆ గ్రామ పంచాయతీలో దాదాపు 500 జాబ్ కార్డులున్నాయి. వారానికి ఒక్కొక్క కార్డుకు రూ.100 చొప్పున మాధవ్ వసూలు చేస్తున్నారు. ఈ లెక్కన నెలకు దాదాపు రూ.2లక్షలు వసూలు చేస్తున్నట్లు కూలీలు చెబుతున్నారు. తమకు ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని, డబ్బు ఇచ్చుకోలేమని చెప్పిన కూలీలను పనులు ఇచ్చేది లేదని, మస్టర్ ఆపేస్తానని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు మండలంలో తరచూ జరుగుతున్నా సంబంధిత ఏపీవో పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

వంట నూనెల దుకాణాల్లో సోదాలు



తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 17: తిరుపతి, ఏర్పేడు, శ్రీకాళహస్తి, చిత్తూరు తదితర ప్రాంతాల్లోని దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు మంగళవారం సోదాలు చేశారు. కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకం పెంచిన నేపథ్యంలో కొందరు వ్యాపారులు వంట నూనెలను బ్లాక్ మార్కెట్‌కు తరలించి, కృత్రిమ కొరత సృష్టిస్తుండడంపై అధికారులు దృష్టి సారించారు. నాలుగు టీములుగా ఏర్పడి తిరుపతి, ఏర్పేడు, శ్రీకాళహస్తి, చిత్తూరులలో సోదాలు చేశారు. అధిక ధరకు విక్రయిస్తున్న, నోస్టాక్ బోర్డు పెట్టిన 10 దుకాణాలపై కేసులు నమోదు చేశారు.





అధికారనంది వాహనంపై విహరిస్తున్న వరసిద్ధుడు - ఆస్థాన మండపంలో నృత్యం చేస్తున్న కళాకారులు

అధికార నంది వాహనంపై వరసిద్ధుడి విహారం

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 17: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా మంగళవారం వరసిద్ధుడికి అధికార నంది వాహన సేవను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాణిపాకానికి చెందిన వళ్లువర్ వంశస్తులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఉదయం ఉభయదారుల ఆధ్వర్యంలో మూలవిరాట్‌కు అభిషేకం చేశారు. ప్రధాన ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రాత్రి ఉభయదారులు ఉభయ వరస తీసుకు రావడంతో అలంకార మండపం వద్ద స్వామివారి ఉత్సవ విగ్రహాలకు పూజలు జరిగాయి. అనంతరం సిద్ధి,బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామిని అధికారనంది వాహనంపై అధిష్ఠింపజేసి కాణిపాకం పురవీధుల్లో ఊరేగించారు. ఆస్థాన మండపంలో కళాకారుల నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఇన్‌స్పెక్టర్లు విష్ణుశ్‌రవి ఉభయదారులు పాల్గొన్నారు.

కాణిపాకంలో నేడు

ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా బుధవారం వరసిద్ధుడికి రావణబ్రహ్మ వాహన సేవ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి పుణ్యసముద్రం, లక్ష్మాంబపురం, సంతపల్లె, ద్వారకాపురం, కురప్పపల్లె, సిద్ధంపల్లె, ముద్దురామాపురం గ్రామస్థులు ఉభయదారులుగా వ్యవహరించనున్నారు.





వరదరాజస్వామి ఆలయంలో సత్యనారాయణస్వామి వ్రతం చేస్తున్న భక్తులు - శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజస్వామికి నిర్వహిస్తున్న పున్నమి గరుడ సేవ

కాణిపాకంలో వైభవంగా పున్నమి గరుడ సేవ

ఐరాల(కాణిపాకం),సెప్టెంబరు 17: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలోని వరదరాజస్వామి ఆలయంలో మంగళవారం పున్నమి గరుడ సేవను వైభవంగా నిర్వహించారు. మహాలయ పౌర్ణమిని పురస్కరించుకుని ఉదయం వరదరాజస్వామి మూల విరాట్‌కు అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంగాలో భక్తుల ఆధ్వర్యంలో సత్యనారాయణ స్వామి పూజ, వ్రతాన్ని నిర్వహింపచేశారు. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజస్వామి ఉత్సవ విగ్రహాలను గరుడ వాహనంపై ఉంచి కాణిపాకం పుర వీధుల్లో ఊరేగించారు. ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్లు శ్రీధర్‌బాబు, కోదండపాణి,ఆలయ ఇన్‌స్పెక్టర్లు విష్ణేష్, రవి పాల్గొన్నారు.

అన్నదానానికి 2.5 టన్నుల కూరగాయల వితరణ

ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి కర్ణాటక రాష్ట్రం చింతామణికి చెందిన గంగాధర్ మంగళవారం 2.5 టన్నులు 12 రకాల కూరగాయలను అధికారులకు అందించారు. విరాళదాతకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి దర్శన భాగ్యం కల్పించారు. అలాగే అన్నదాన కార్యక్రమానికి ఒంగోలుకు చెందిన ప్రత్యూష రూ.1,00,116 విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో అన్నదాన సూపరింటెండెంట్ బాలరంగస్వామి, మునిరామయ్య, ఆలయ ఇన్‌స్పెక్టర్ విష్ణేష్ తదితరులు పాల్గొన్నారు. కాగా, స్వామివారిని కర్నూలు జిల్లా డోన్ నియోజకవర్గ ఎమ్మెల్యే కోట్లసూర్యప్రకాష్‌రెడ్డి దర్శించుకున్నారు.





కూరగాయలు అందజేస్తున్న గంగాధర్ - రూ.లక్ష విరాళంగా అందిస్తున్న ప్రత్యూష

రెవెన్యూ మాయాజాలంతో నకిలీ రిజిస్ట్రేషన్

లబోదిబోమంటున్న జక్కిదొనవాసి


నకిలీ రిజిస్ట్రేషన్‌పై సబ్ రిజిస్ట్రార్‌ను ప్రశ్నిస్తున్న బాధితుడు

పాకాల, సెప్టెంబరు 17: రెవెన్యూ అధికారుల మాయాజాలం, దళారుల జిమ్మిక్కులతో పాకాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇటీవల ఓ అక్రమ రిజిస్ట్రేషన్ జరిగింది. విషయం తెలుసుకున్న బాధితుడు లబోదిబోమంటూ స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్ ఎలా చేస్తారని మంగళవారం అధికారులను నిలదీశాడు. బాధితుడి వివరాల మేరకు... వెదురుకుప్పం మండలం జక్కిదొన రెవెన్యూ గంటావారిపల్లెకు చెందిన శ్రీపురం దామోదరం రెడ్డి కుటుంబ సభ్యులకు ఆ గ్రామంలో సర్వే నెంబరు 513-16లో 66 సెంట్ల వ్యవసాయ భూమి ఉంది. వీరి అనుభవంలోనే ఉన్న ఆ భూమిలో వరి సాగు చేశారు. ఈ భూమిని ఇటీవల అదే గ్రామానికి చెందిన పుల్లారెడ్డి అనే వ్యక్తి పేరుతో రిజిస్ట్రేషన్ చేశారు. అతడు మళ్లీ తన కొడుకు పేరుమీద దాన విక్రయం రిజిస్ట్రేషన్ చేశాడు. రెవెన్యూ అధికారుల సహకారంతో 1బి సృష్టించి ఈ తతంగం నడిపించారు. మళ్లీ ఆ సర్వే నెంబర్ విస్తీర్ణం ఆన్‌లైన్‌లో మాయంచేశారు. ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహించిన సీనియర్ అసిస్టెంట్ పెంచల కుమార్ 1బి మేరకు రిజిస్ట్రేషన్ చేసేశాడు. ఈ విషయం తెలుసుకున్న బాధితుడు మంగళవారం ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ హేమంత్‌ను నిలదీశాడు. 1బి ఉండటంతో నిబంధనల మేరకు రిజిస్ట్రేషన్ చేశామని వివరించారు. ఈ వ్యవహారంలో రెవెన్యూ అధికారులు, పూతలపట్టు డాక్యుమెంట్ రైటర్ కృష్ణ, మరి కొందరి ప్రమేయం ఉన్నట్లు బాధితుడు ఆరోపించాడు.







అమ్మవారి ఉత్సవమూర్తికి, విమాన ప్రాకారానికి పవిత్రమాలలు సమర్పిస్తున్న అర్చకులు - పవిత్రోత్సవాల్లో ఎమ్మెల్యే నాని దంపతులు

పద్మావతీదేవికి పవిత్రాల సమర్పణ

తిరుచానూరు, సెప్టెంబరు 17: తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ జరిగింది. ఉదయం సహస్రనామార్చన, నిత్యార్చన తరువాత పవిత్ర సమర్పణ నిర్వహించారు. అమ్మవారి మూలమూర్తికి, ఉత్సవర్లకు, ఉప ఆలయాలకు, పరివార దేవతలకు, విమాన ప్రాకారానికి, ధ్వజస్తంభానికి పవిత్రాలు సమర్పించారు. సాయంత్రం యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులు, జేఈవో వీరబ్రహ్మం దంపతులు, డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ కేపీ చంద్రశేఖర్, శేషగిరి అర్చకులు శ్రీనివాసాచార్యులు, బాబుస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, గణేష్, సుభాస్కర నాయుడు తదితరులు పాల్గొన్నారు. కాగా తిరుచానూరు పద్మావతి అమ్మవారికి మంగళవారం ఎమ్మెల్యే పులివర్తి నాని, సుధారెడ్డి దంపతులు వందకేజీల కుంకుమను ఆలయ అధికారులకు అందజేశారు. అమ్మవారి పవిత్రోత్సవాల్లో పాల్గొని పసుపు, కుంకుమ, సారెను సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని ఆలయ అధికారులపై తీవ్రస్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం మారినా ఆలయ అధికారుల తీరు మాత్రం మారలేదని, వైసీపీ ప్రతినిధులకు ఇప్పటికూడా ఆలయంలో రాచమర్యాదలు చేస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ ప్రతినిధులు వస్తే పట్టించుకోవడంలేదంటూ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

నులిపురుగుల రహిత సమాజం నిర్మిద్దాం

తొలి రోజే 96.4 శాతం పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ : ఏడీఎంహెచ్‌వో


విద్యార్థినితో మాత్ర మింగిస్తున్న వైద్య సిబ్బంది, పక్కన కలెక్టర్, ఎంపీ తదితరులు

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 17: ఆరోగ్యవంతమైన పిల్లలు, సర్వసమాజం కోసం నులిపురుగుల రహిత సమాజం నిర్మిద్దామని కలెక్టర్ సుమిత్ కుమార్, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు పిలుపునిచ్చారు. విద్య, వైద్య శాఖల సమన్వయంతో మంగళవారం చిత్తూరులోని లిటిల్‌ఫ్లవర్ స్కూల్లో జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. అడిషనల్ డీఎంహెచ్‌వో వెంకట ప్రసాద్ మాట్లాడుతూ.. జిల్లాలోని 5,466 అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో 3,63,888 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. తొలిరోజున 96.4 శాతం లక్ష్యం పూర్తి చేశామని, మిగిలిన శాతాన్ని 25వ తేదీన పూర్తి చేస్తామన్నారు. డీఐవో డాక్టర్ హనుమంతరావు, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మేయర్ కఠారి హేమలత, డీవైఈవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రేపు కుప్పంలో పీజీఆర్ఎస్

చిత్తూరు, సెప్టెంబరు 17: కుప్పం ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ప్రజా సమస్య పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంటవరకు ప్రజలనుంచి అర్జీలు స్వీకరిస్తారన్నారు. మండల, నియోజకవర్గ స్థాయి అధికారులందరూ హాజరుకావాలని ఆదేశించారు.

రాజకీయాలు పక్కనబెట్టి అభివృద్ధి చేయండి : ఎంపీ మిథున్





సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి - బోయకొండ ఆర్చి వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

చౌడేపల్లె, సెప్టెంబరు 17: ఎన్నికల వరకే రాజకీయం చేయాలని, ఆ తరువాత అభివృద్ధి చేయాలని ఎంపీ మిథున్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో భారీ బందోబస్తు మధ్య వైసీపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరావతే కాదు పుంగనూరు నియోజకవర్గాన్ని సీఎం చంద్రబాబు గుర్తుపెట్టుకుని అభివృద్ధి చేయాలని కోరారు. పుంగనూరు నుంచి రొంపిచెర్ల వరకు ఉన్న నాలుగు లేన్ల రోడ్డును పూర్తిచేయాలన్నారు. వాటర్ గ్రిడ్ ప్రాజెక్టును త్వరగా పూర్తిచేసి నీటిసమస్య పరిష్కరించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ రెడ్డెప్ప, వైసీపీరాష్ట్రకార్యదర్శి పెద్దిరెడ్డి, జడ్పీటీసీ సభ్యులు దామోదర్‌రాజు, బోయకొండ మాజీ చైర్మన్ మిద్దింటి శంకర్‌నారాయణ, మాజీ జడ్పీటీసీ రుక్మిణమ్మ పాల్గొన్నారు.

120 మందితో బందోబస్తు

మిథున్‌రెడ్డి పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ జరగకుండా 150 మంది పోలీసులతో పుంగనూరు రూరల్ సీఐ రాంభూపాల్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇద్దరు డీఎస్పీలు, ఐదుగురు సీఐలు, ఆరుగురు ఎస్ఐలు, 120 మంది కానిస్టేబుళ్లతో చౌడేపల్లె నలువైపులా బందోబస్తు కల్పించారు.

సెక్యూరిటి పెంచుకోవడానికే మిథున్ ఆరాటం : చల్లా బాబు

ఎంపీ మిథున్‌రెడ్డి సెక్యూరిటీ పెంచుకోవటానికే ఆరాటపడుతున్నాడని టీడీపీ పుంగనూరు ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఎంపీ పర్యటనను టీడీపీ నాయకులు, కార్యకర్తలు అడ్డుకునే ఆలోచనే లేదని స్పష్టం చేశారు.

310 మొబైల్ ఫోన్ల రికవరీ


రికవరీ చేసిన ఫోన్లను పరిశీలిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 17: రూ.62 లక్షల విలువ చేసే 310 మొబైల్ ఫోన్లను రికవరీ చేసినట్లు తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. రికవరీ చేసిన ఫోన్లను మంగళవారం ఎస్పీ కార్యాలయంలో బాధితులకు అప్పగించారు. ఎస్పీ మాట్లాడుతూ మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న వారు వెంటనే మొబైల్ హంట్ లేదా సీఈఐఆర్ పోర్టర్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఇప్పటివరకు 10 విడతల్లో రూ.6.07 కోట్ల విలువ చేసే 3,530 మొబైల్ ఫోన్లు రికవరీ చేసి, బాధితులకు అప్పగించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచారి, వెంకట్రావు, సైబర్ క్రైం సీఐ వినోద్ కుమార్ పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణకు ప్రజా సహకారం అవసరం



మదనపల్లెలో ప్రజల చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 17: మదనపల్లె పట్టణంలో పారిశుధ్య నిర్వహణకు ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి పారిశుధ్య కార్మికులు, ఉద్యోగులు, ప్రజలు కలసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా అనిబిసెంట్ సర్కిల్ వద్ద అందరిచేత ఎమ్మెల్యే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజ, మున్సిపల్ కమిషనర్ ప్రమీల, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు. మదనపల్లె మండలంలోని 25 గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో స్వచ్ఛత హి సేవా కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో భానుప్రసాద్, ఇన్‌చార్జి ఈవోఆర్డీ శ్రీహరి, సర్పంచ్‌లు చిప్పిలి చలపతి, ఆనంద పార్థసారథి, మహేష్, దీప, కరుణాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


ములకలచెరువు ర్యాలీలో టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, అధికారులు

ములకలచెరువులో: ములకలచెరువులో మంగళవారం స్వచ్ఛత హీ సేవ ర్యాలీ నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, ఎంఈవో వెంకటరమణ, ఏవో గౌస్‌బాషా, పంచాయతీ కార్యదర్శులు ఇబ్రహీం, ప్రశాంత్, టీడీపీ నాయీబ్రాహ్మణ సెల్ అధ్యక్షుడు కేశవులు. సచివాలయ సిబ్బంది, విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు. అలాగే దేవళచెరువు, బురకాయలకోటలో నిర్వహించిన ర్యాలీ, మానవహారంలో రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, టీడీపీ నేతలు ముత్తుకూరు మౌళా, జేసీబీ సుధాకర్‌నాయుడు, విజయ్‌కుమార్ హాజరయ్యారు.

నిమ్మనపల్లిలో: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛత హీ సేవా ద్వారా గ్రామాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఎంపీడీవో రమేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధికారులు, విద్యార్థులచే ర్యాలీ, మానవహారం నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటరమణ, మల్లికార్జున, మల్లప్ప తదితలరు పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో: మండలంలో స్వచ్ఛత సేవా 2024 అవగాహన ర్యాలీ ఎంపీడీవో శ్రీధర్‌రావు, ఎంఈవో మనోహర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు, విద్యార్థులు ర్యాలీలు నిర్వహించారు.

తంబళ్లపల్లెలో: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం మనందరి బాధ్యత అని ఎంపీడీవో సురేంద్రనాథ్ అన్నారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం అధికారులు, కూటమి నాయకులు విద్యార్థులతో కలసి తంబళ్లపల్లెలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నేతలు సిద్దమ్మ, పురుషోత్తం, శివకుమార్, వెంకటరెడ్డి, సాంబశివారెడ్డి, రాజారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

గుర్రంకొండలో: ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించినప్పుడే రోగాలకు దూరంగా ఉంటారని ఎంపీడీవో వెంకటేశులు అన్నారు. స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం హైస్కూల్ నుంచి బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు.

కలకడలో: పరిసరాల పరిశుభ్రత గ్రామాల్లో ప్రజలందరి బాధ్యత అన్ని ఎంపీడీవో పరమేశ్వరరెడ్డి అన్నారు. కలకడ మంగళవారం ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, ప్రజలు, విద్యార్థులతో కలిసి స్వచ్ఛతాహి సేవ నిర్వహించారు.

వాల్మీకిపురంలో: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని వాల్మీకిపురం ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ఫైరోజాబేగం పేర్కొన్నారు. స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో మంగళవారం ఆస్పత్రి ఆవరణలో వైద్యులు, సిబ్బంది కలిసి పిచ్చి మొక్కలు తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో మనోహర్‌రాజు, డాక్టర్లు మమత, శ్రీలక్ష్మి, హర్షితరెడ్డి, రవికుమార్, మొహ్మద్‌ఆసిఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో : మండలంలోని 20 గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛతాహి కార్యక్రమాన్ని మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, పాఠశాల విద్యార్థులు, స్వయం సహాయక బృంద సభ్యులు, పంచాయతీ కార్మికులు, అధికారులు సంయుక్తంగా నిర్వహించారు. ఎంపీడీవో కేవీన్ బాలాజీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కురబలకోటలో: మండలంలోని అన్ని పంచాయతీలలో పారిశుధ్యం తతలెత్తకుండా చర్యలు చేపట్టనున్నట్లు ఎంపీడీవో హరినారాయణ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని అన్ని పంచాయతీలలో స్వచ్ఛత హి సేవ ర్యాలీలను నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పోరెడ్డి విశ్వనాథరెడ్డి, అయూబ్ బాషా, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కలికిరిలో: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలు పారిశుధ్యంతోపాటు పచ్చదనానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీవో గంగయ్య కోరారు. మండలంలో స్వచ్ఛతా సేవపై అవగాహనా కల్పించారు. కార్యక్రమంలో సర్పంచు ఎల్లయ్య, టీడీపీ నాయకుడు యోగేష్ రెడ్డి పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో: స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా బి.కొత్తకోట జ్యోతిచౌక్‌లో ఎంపీడీవో శంకరయ్య, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలని పిలుపునిచ్చారు.

అరకొర వైద్యంతో అవస్థలు

ఆంధ్రజ్యోతి విజిట్

- మదనపల్లె పెద్దాస్పత్రిలో చిన్న కేసులు కూడా రెఫరలే..
- పలుచోట్ల సమ్మెలో పీహెచ్‌సీ వైద్యాధికారులు
- వచ్చిన రోగులకు మందు బిళ్లలే శరణ్యం
- పీలేరు నియోజకవర్గంలోనూ రోగుల పరిస్థితి దుర్భరం
- వైద్యుల కోసం రోగుల ఎదురుచూపులు
- వాల్మీకిపురం ఆస్పత్రి భవనంలో లిఫ్టులేక రోగుల పాట్లు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 17:మదనపల్లె 'ప్రభుత్వ సర్వజన బోధనాస్పత్రి' పేరుకే పెద్దాస్పత్రి కాని ఇక్కడ చిన్నచిన్న కేసులను కూడా తిరుపతికి రెఫర్ చేసేస్తున్నారు. అదేమంటే ఇక్కడ స్పెషలిస్టులు లేరని సమాధాన చెబుతారు...ఇదీ మదనపల్లె పట్టణంలోని సర్వజన బోధనాస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్యం తీరు. మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లోని పీహచ్‌సీలు, సీహెచ్‌సీ, ప్రభుత్వాస్పత్రుల్లో మంగళవారం 'ఆంధ్రజ్యోతి విజిట్'లో పలు అంశాలు వెలుగు చూశాయి...

● మదనపల్లె సర్వజన బోధనాస్పత్రిలో 1120 మంది రోగులు అవుట్ పేషెంట్లుగా వైద్య చికిత్సలు చేయించుకున్నారు. ఇక్కడ ఓపీ విభాగంలో 19 రకాల రోగాలకు వైద్యులు చికిత్సలు అందించారు. ముఖ్యంగా జ్వరబాధితులు పెద్దసంఖ్యలో రావడంతో వారికి ఓపీలోనే చికిత్సలు అందించి, ఇంజెక్షన్లు, మందులు ఇచ్చారు. కాకపోతే ప్రమాదాల్లో తలకు, శరీరానికి దెబ్బలు తిన్న వారికి సీటీ స్కానింగ్, ఎంఆర్‌ఐ స్కానింగ్ ప్రభుత్వాస్పత్రిలో చేయకుండా ప్రైవేటు స్కానింగ్ సెంటర్లకు రెఫర్ చేస్తున్నారు. దీంతో పేద రోగులు చేతిలో డబ్బులు లేక, అప్పులు చేసి ప్రైవేటు స్కానింగ్‌సెంటర్లకు వెళుతున్నారు. ఇక్కడ ఇన్‌పేషెంట్ల కోసం 440 పడకలు ఉండగా, వారందరికి చికిత్సలు అందించేందకు సరిపడా పరికరాలు, గ్లోవ్స్ కొనేందుకు బడ్జెట్ కేటాయించలేదు. దీంతో కొన్ని సందర్భాల్లో రోగులే బయట మందుల దుకాణాలకు వెళ్లి కొనుక్కోవాల్సిన దుస్థితి నెలకొంది. మదనపల్లె మండలంలో సీటీఎం, బొమ్మనచెరువు పీహెచ్‌సీలు ఉండగా సీటీఎం పీహెచ్‌సీలో సమయానికే వైద్యురాలు, సిబ్బంది హాజరై రోగులకు చికిత్సలు అందించారు. కాకుంటే పీహెచ్‌సీ ఆవరణలో పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు ఏపుగా పెరిగిపోయి పాములు, విషకీటకాలకు నిలయంగా మారాయి. రాత్రి అయితే ఈ పీహెచ్‌సీకి రోగులు వచ్చేందుకు బయపడుతున్నారు. నిమ్మనపల్లె పీహెచ్‌సీలో వైద్యాధికారి రమేశ్‌బాబు ఇన్‌చార్జి డిప్యూటీ డీఎంహెచ్‌వోగా మదనపల్లెలో విధులు నిర్వహణకు వెళ్లారు. మరో వైద్యురాలు ప్రత్యూష విజయవాడలో వైద్యులు చేపట్టిన సమ్మెకు వెళ్లారని దీంతో ఇక్కడికి వచ్చిన రోగులకు నర్సులే డాక్టర్ల అవతారం ఎత్తి చికిత్సలు చేసి మందుబిళ్లలు ఇచ్చి పంపుతున్నారు. రామసముద్రం మండలంలో రామసముద్రం, బొమ్మనెచెరువు పీహెచ్‌సీలు ఉండగా ఇక్కడ వైద్యులు సకాలంలో వచ్చి రోగులకు చికిత్సలు అందించారు.

తంబళ్లపల్లె నియోజకవర్గంలో...

తంబళ్లపల్లె నియోజకవర్గం అంటేనే జిల్లాలో మారు మూల గ్రామాల సమాహారం. ఆరు మండలాల్లో ఉన్న పీహెచ్‌సీల్లో వైద్యుల కొరత కొట్టొచ్చినట్లు కనపడుతోంది. విధులకు హాజరయ్యే వైద్యులు జ్వరాలకు ఇతర రోగాలకు చికిత్సలు అందిస్తున్నారే కాని అత్యవసర కేసుల్లో కొన్నింటిని మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి రెఫర్ చేస్తున్నారు. బి.కొతకోటలో పేరుకే 30 పడకల ఆస్పత్రి ఉన్నా సౌకర్యాలు శూన్యం. ములకలచెరువు పట్టణం గుండా జాతీయ రహదారి వెళుతున్న క్రమంలో ఈ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి. మంగళవారం 'ఆంధ్రజ్యోతి విజిట్'లో పలుచోట్ల వైద్యులు సకాలంలో విధులకు హాజరు కాలేదు. వైద్యుల సమ్మెలో పాల్గొనేందుకు ములకలచెరువు, పెద్దమండ్యం పీహెచ్‌సీల వైద్యులు వెళ్లగా అత్యవసర చికిత్సలు మాత్రమే అందించారు కాని ఓపీ తక్కువగా చూశారు. ములకలచెరువులో ఇద్దరు వైద్యులు అందుబాటులో లేకపోవడంతో నర్సులే రోగులకు చికిత్సలు చేశారు. పెద్దమండ్యం పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు విధులకు హాజరు కాలేదు. మిగిలిన వైద్య సిబ్బంది 9.30 గంటలకు ఆలస్యంగా వచ్చారు. ఇక్కడ ఇద్దరు వైద్య సూపర్‌వైజర్లు బదిలీపై వెళ్లగా వారి స్థానంలో ఎవరిని నియమించలేదు. దీంతో క్షేత్రస్థాయిలో వైద్యసిబ్బంది సేవలు పర్యవేక్షణ కొరవడింది. రూ.25లక్షలతో నిర్మించిన ల్యాబ్ ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. బి.కొత్తకోటలో ఏడుగురు వైద్యులు విధులు నిర్వహించాల్సి ఉండగా, నలుగురు మాత్రమే విధులకు హాజరయ్యారు. దీంతో రోగులకు సకాలంలో వైద్యసేవలు అందడం లేదు. కందుకూరు, కురబలకోట పీహెచ్‌సీల్లో రోగులకు సకాలంలో వైద్యం అందడం లేదు. సీరియస్ కేసులు రెఫర్ చేస్తున్నారు.

పీలేరులో వైద్యుల కోసం రోగులు నిరీక్షణ

పీలేరు, సెప్టెంబరు 17: పీలేరు మండలం రేగళ్లలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్ని వసతులు ఉన్నప్పటికీ వైద్యులు లేకపోవడంతో రోగులకు తిప్పలు తప్పడం లేదు. తమ డిమాండ్ల సాధన కోసం వైద్యులు సమ్మెలో ఉండడంతో గత కొన్ని రోజులుగా రేగళ్ల పీహెచ్‌సీ పరిధిలోని ప్రజలు సరైన వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారు. 24 గంటల రేగళ్ల పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు పనిచేస్తుండగా, ఒకరు ప్రతిరోజూ ఓపీలో, మరొకరు 104 వాహనంలో సేవలందిస్తుంటారు. సగటున ప్రతిరోజూ రేగళ్లలో 60 మంది రోగులు వైద్యం పొందుతుంటారు. సాధారణ జబ్బులతోపాటు ఇక్కడ అత్యవసర సమయాల్లో కాన్పులు, విషపురుగుల కాటులకు వైద్యం అందిస్తున్నారు. పీహెచ్‌సీలో సరిపడా సిబ్బంది, మందులు ఉన్నప్పటికీ వైద్యులు లేకపోవడం వల్ల ప్రజలకు ఇబ్బందిగా మారింది.

●గుర్రంకొండలో పేదలు వైద్యం కోసం గంటల తరబడి నిరీక్షిస్తే కానీ ఉచిత వైద్యం అందడం లేదని రోగులు వాపోతున్నారు. గుర్రంకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 24 గంటల ఆసుపత్రి. ఈ ఆసుపత్రిలో ఇద్దరు డాక్టర్లు ఉన్నా ఆసుపత్రికి సకాలంలో రాకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఆసుపత్రిలో స్టాప్ నర్సుల కొరతతో సచివాలయాల్లో పని చేసే ఎంఎల్‌హెచ్‌పీలతో ఓపీ సేవలను చేయిస్తున్నారు. ప్రతి రోజు ప్రభుత్వ ఆసుపత్రికి 50 మందికి పైగా రోగులు వచ్చి వైద్య సేవలను చేయించుకుంటున్నారు. 24 గంటల ఆసుపత్రి కావడంతో రాత్రి పూట డాక్టర్ ఉండేలా చూడాలని రోగులు కోరుతున్నారు. ఈ విషయమై డాక్టర్ రవీంద్రనాయక్ వివరణ కోరగా జిల్లా కేంద్రంలో చేస్తున్న ధర్నాకు తాము వెళ్లినట్లు తెలిపారు.

● కలకడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు డాక్టర్లు ఉండగా డాక్టర్ మల్లికార్జున్ మండలంలో జరుగుతున్న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమానికి నోడల్ అధికారిగా విధులపై వెళ్లినట్లు తెలిపారు. ఆసుపత్రిలో డాక్టర్ మోహన్ అందుబాటులో ఉంటూ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. స్టాఫ్ నర్స్, ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు సరిపడ్డ సిబ్బంది ఉన్నారు.

●వాల్మీకిపురం ప్రభుత్వ వైద్యశాలలో 11 మంది డాక్టర్లకుగాను 9 మంది డాక్టర్లు అందుబాటులో ఉన్నారు. చిన్నపిల్లల వైద్యులు, జనరల్ ఫిజీషియన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. చిన్నపిల్లల వైద్యులు అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు స్థానికులు వాపోతున్నారు. ఈ ఆసుపత్రిలో ప్రతిరోజూ సగటున 200 మంది నుంచి 250 మంది వరకు వైద్య సాయం పొందుతున్నారు. పాత భవనాలలో ఉన్న ఐసోలేషన్ వార్డు నుండు గోడలు దెబ్బతిన్నాయి. రూ.7 కోట్ల వ్యయంతో నిర్మించిన 50 పడకల ఆసుపత్రి నాలుగు అంతస్థుల భవనాలలో ప్రస్తుతం ప్రసూతి వార్డు, ఆపరేషన్ థియేటర్ తదితర అత్యాధునిక సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చినా నూతన భవనాలకు లిఫ్ట్ సౌకర్యం ఏర్పాటు చేయకపోవడంతో అటు రోగులు, ఇటు వైద్య సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. నూతన భవనాలకు ఆర్వో వాటర్ ప్లాంటు సౌకర్యం ఏర్పాటు చేయాల్సి ఉంది. పోస్టుమార్టం అసిస్టెంట్ లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

●కలికిరి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మొత్తం 10 మంది వైద్యులు పనిచేస్తుండగా అందులో ఒకరు మెటర్నిటీ సెలవులో ఉన్నారు. మరో ఇద్దరు వేర్వేరు డ్యూటీలతో ఓడీలో ఉన్నారు. మంగళవారం ఏడుగురు వైద్యులు డ్యూటీలో ఉన్నారు. అన్ని రకాల వైద్యులు అందుబాటులో ఉండడంతో ప్రసూతి కేసులను ఇతర ఆసుపత్రులకు పంపకుండా ఇక్కడే డెలివరీలు నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి పవన్ కుమార్ తెలిపారు. త్వరలో కొత్త భవనాలు అందుబాటులోకి వస్తే మరిన్ని సేవలు అందించేందుకు వీలవుతుందంటున్నారు. ప్రస్తుతం రోజూ 125 నుంచి 250 మంది వరకు ఓపీ ఉంటోంది.


మదనపల్లె ప్రభుత్వాస్పత్రి ఓపీలో బారులు తీరిన జ్వర పీడితులు


ములకలచెరువులో డాక్టర్ రాకపోవడంతో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీ


పెద్దమండ్యంలో డాక్టర్లకు బదులు రోగులకు చికిత్సలు అందిస్తున్న నర్సులు


బి.కొత్తకోటలో చికిత్సల కోసం బారులు తీరిన రోగులు


మదనపల్లె సీటీఎం పీహెచ్‌సీలో పాముల నిలయంగా మారిన ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు


తంబళ్లపల్లెలో చికిత్స కోసం వచ్చిన రోగులు


పీలేరు మండలం రేగళ్ల పీహెచ్‌సీలో ఖాళీగా ఉన్న వైద్యుల గది

ఘనంగా మోదీ జన్మదిన వేడుకలు


ఆస్పత్రిలో రక్తదానం చేస్తున్న బీజేపీ నాయకులు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 17: పట్టణంలో ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు మంగళవారం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లంపల్లె ప్రశాంత్, పట్టణ అధ్యక్షుడు బర్నేపల్లె రవికుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సేవ పర్వే పేరిట వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ సర్వబోధనాస్పత్రిలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. నిమ్మనపల్లె సర్కిల్‌లో పేదలకు అన్నదానం చేశారు. ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆకుల కృష్ణమూర్తి, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు వినోద్, సీనియర్ నేతలు నారథరెడ్డి, నాగరాజ, వర్మ, స్వామి నాయక్, ఓబీసీ రాష్ట్ర నేత వేణుగోపాల్ పాల్గొన్నారు.

రామసముద్రంలో: రామసముద్రం మండలం చెంబకూరు జడ్పీ హైస్కూల్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. బీజేపీ నాయకులు కృష్ణమూర్తి, నగేష్, ఆనంద్‌కుమార్‌నాయుడు పాల్గొన్నారు.

ములకలచెరువులో: ములకలచెరువులో మంగళవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నేత గోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు జయరాంరెడ్డి, నాయకులు బాబు పాల్గొన్నారు.

గుర్రంకొండలో: ప్రధాని మోదీ జన్మదిన వేడుకలను మండల బీజేపీ నాయకులు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు మిఠాయిలను పంచిపెట్టారు. బీజేపీ నేతలు రామాంజులు, భరత్, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

భర్త దాడిలో గాయపడిన మహిళ

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు17: బసినికొండ పంచాయతీ, మారెమ్మవీధిలో కాపురం ఉన్న ఉదయ్‌కుమార్ భార్య పల్లవి (26)పై మంగళవారం దాడి చేసి కత్తెరతో మెడపై, చేతిపై గాయపర్చాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలుకా సీఐ కలా వెంకటరమణ పేర్కొన్నారు. .

ఘనంగా పెరియార్ జయంతి

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు17: మదనపల్లెలో మంగళవారం పెరియార్ రామస్వామి జయంతిని పలు చోట్ల ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పెరియార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టీడీపీ నాయకులు షంషీర్, స్వామి, శ్రీనివాసులు, రఘునాథనాయుడు పాల్గొన్నారు.

పరిహారం కోసం రైతుల ప్రతిఘటన


ఎన్‌హెచ్ అధికారులు, పోలీసులతో మాట్లాడుతున్న రైతులు

పీలేరు, సెప్టెంబరు 17: కోట్లాది రూపాయల విలువజేసే మా భూములకు మెరుగైన పరిహారం అందే వరకు రోడ్డు పనులు చేయనీయమంటూ పీలేరు మండలం బోడుమల్లువారిపల్లెకు చెందిన ఇద్దరు రైతులు భీష్మించుకోవడంతో మంగళవారం పీలేరులో ఉద్రిక్తత నెలకొంది. వారిలో పీలేరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి సర్వే నెం.157లో 1.60 ఎకరాలు, తపాలా శాఖ మాజీ ఉద్యోగి అమరనాథరెడ్డికి సర్వే నెం.260/1లో 18 సెంట్ల భూమి రోడ్డు విస్తరణ కోసం ఎన్‌హెచ్ అధికారులు తీసుకున్నారు. అప్పట్లో పురుషోత్తంరెడ్డికి రూ.11 లక్షలు, అమరనాథరెడ్డికి రూ.5 లక్షలు పరిహారంగా మంజూరు చేశారు. అయితే పీలేరు పట్టణానికి అతి సమీపంలో ఉన్న తమ భూములు కోట్లాది రూపాయల విలువ చేస్తాయన్నారు. ఈ నేపథ్యంలో ఎన్‌హెచ్ అధికారులు మంగళవారం వారిద్దరి భూముల్లో పనులు ప్రారంభించగా వారు అడ్డుకోవడంతో ఎన్‌హెచ్ అధికారులు పోలీసులను ఆశ్రయించారు. దీంతో రంగప్రవేశం చేసిన పోలీసులు జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడుకోవాలని బందోబస్తు నడుమ పనులు ప్రారంభించారు. అయితే తాము మాత్రం మెరుగైన పరిహారం కోసం న్యాయపోరాటం చేస్తామన్నారు.

రాష్ట్రంలో బీసీ జనగణన చేపట్టాలి

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 17: రాష్ట్రంలో బీసీల జనగణనను నిర్వహించి, జనాభా దామాషా ప్రకారమే రిజర్వేషన్లు కల్పించాలని బీఎస్పీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ పూర్ణచంద్రరావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక నీరుగట్టుపల్లెలోని జ్యోతిరావ్‌పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం అక్కడ నుంచి బీసీ, ఎస్సీ, మైనార్టీ కులసంఘాల నాయకులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్, ఏపీ వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీనివాసులు, మాజీ కౌన్సిలర్ సహజీవన్ బాబు, కవి పోతబోలు రెడ్డెప్ప, అన్ని బీసీ కులాల నాయకులు, బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

అజ్మీర్ యాత్ర విజయవంతం కావాలి

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 17: ముస్లిం మహిళలు చేపట్టిన అజ్మీర్ యాత్ర విజయవంతం కావాలని ఎమ్మెల్యే షాజహాన్ బాషా సతీమణి గుల్నాజ్ బేగం ఆకాంక్షించారు. మంగళవారం స్థానిక మోతినగర్‌లో టీడీపీ రాష్ట్ర మైనారిటీ విభాగం ఉపాధ్యక్షుడు ఎస్ఏ మస్తాన్, నస్రీన్‌తాజ్ దంపతులు ఆధ్వర్యంలో 38 మంది ముస్లిం మహిళలను ఉచితంగా అజ్మీర్‌యాత్రకు పంపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు రోజులు పాటు జరిగే ఈ యాత్రలో రాను పోను టికెట్లతో సహా మొత్తం ఖర్చులన్నీ మస్తాన్ భరిస్తున్నారన్నారు. ప్రతి మహిళకు రూ.1000 చొప్పున ఖర్చులను ఎమ్మెల్యే సతీమణి అందజేశారు. దాదాపీర్, సాజిద్, బావాజాన్, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి


నారా లోకేశ్‌తో టీడీపీ నేత జయచంద్రారెడ్డి

ములకలచెరువు, సెప్టెంబరు 17: తంబళ్లపల్లె నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేసి సహాయ సహకారాలు అందించాలని మంత్రి నారా లోకేశ్‌ను తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి కోరారు. విజయవాడలోని స్వగృహంలో మంగళవారం మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను జయచంద్రారెడ్డి కలిసి నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి తోడ్పాటు అందించాలని కోరారు. అలాగే ఆర్టీసీ డిపో ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలతో నిర్వహించిన సమావేశానికి హాజరయ్యారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి చర్చలు జరిపారు.

వరద బాధితులకు భవన నిర్మాణ కార్మికుల సాయం


ఎమ్మెల్యేకు రూ.2లక్షల డీడీ అందిస్తున్న బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 17: విజయవాడ వరద బాధితుల సహాయార్థం మదనపల్లె భవన నిర్మాణ కార్మికుల సంఘం సభ్యులు రూ.2,00,116 వితరణగా అందజేశారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు డీడీ రూపంలో విరాళం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్మికులే అయినా తలా కొంచెం వేసుకుని వరద బాధితులను ఆదుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు జంగాల శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి బీవీరమణ, కార్యదర్శి ఎస్.రెడ్డిసా హెబ్, సభ్యులు శ్రీనివాసులు, రమణ, నారాయణ,మల్లికార్జున పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి రూ.2లక్షల విరాళం


సీఎంకు చెక్కును అందజేస్తున్న దగ్గుబాటి

కలకడ, సెప్టెంబరు 17:వరదబాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి రూ.2లక్షల విరాళం ఇచ్చినట్లు ఎంవీరావు చిట్స్ ప్రైవేట్ కంపెనీ బిజినెస్ అడ్వైజర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం సచివాలయంలోని చాంబర్‌లో సీఎం చంద్రబాబునాయుడిని కలిసి చెక్కును అందజేసినట్లు దగ్గుబాటి తెలిపారు. ఈ సందర్భంగా వరదబాధితులకు అండగా తక్షణం ప్రభుత్వం స్పందించిన తీరు వారికి అం దిస్తున్న సహాయ సహకారాలు గురించి సీఎం కృతజ్ఞతలు తెలిపినట్లు పేర్కొన్నారు.

పెద్దమండ్యంకు హాస్టల్ మంజూరు చేయండి

పెద్దమండ్యం, సెప్టెంబరు 17: పెద్దమండ్యం విద్యార్థుల కోసం ప్రభుత్వం హాస్టల్ మంజూరు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. పెద్దమండ్యంలో పదేళ్ల క్రితం ప్రైవేటు అద్దె భవనంలో ప్రభుత్వ హాస్టల్ ఉండేదని గత ప్రభుత్వం హాస్టల్ భవనం కోసం హైస్కూల్ వద్ద స్థలం కేటాయించి, భవన నిర్మాణానికి నిధులు కేటాయించినా ఆ తరవాత కొన్ని కారణాల వల్ల అధికారులు రద్దు చేసినట్లు స్థానికులు వెల్లడించారు. అప్పట్లో పెద్దమండ్యం హాస్టల్‌లో స్థానిక హైస్కూల్‌లో చదువుతున్న ముసలికుంట, బండ్రేవు, దిగువపల్లి, మందలవారిపల్లి ప్రాంత పేద విద్యార్థులు ఉండేవారన్నారు. అధికారులు తగు చర్యలు తీసు కొని పెద్దమండ్యంకు ప్రభుత్వ హాస్టల్ మంజూరు చేసి, హాస్టల్ భవనం నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని వారు కోరారు.